తిరుమలలో చంద్రబాబు కుటుంబం



నుదుట తిరునామం.. తళతళ మెరిసే సరిగ పంచె, లాల్చీ.. మెడలో పట్టు కండువా.. సంప్రదాయ వస్త్రధారణతో తాతా మనవళ్లు ఇద్దరూ శుక్రవారం తిరుమలలో సందడి చేశారు. చిరునవ్వులతో భక్తులకు అన్నం వడ్డించారు. నారా దేవాన్ష్ 11వ పుట్టినరోజున ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం, అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భోజనాలు వడ్డించారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే రూ.44 లక్షల విరాళాన్ని టీటీడీకి అందజేశారు. ఏటా ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం పాటిస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అన్నం వడ్డించి.. ఆప్యాయంగా పలకరించి..

దేవాన్ష్ పుట్టినరోజు సందడి



శ్రీవారి ఆలయంలో సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

సీఎం చంద్రబాబుతో పాటూ ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, దేవాన్ష్ ఉదయం 8.30గంటలకు శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. సీఎం హోదాలో మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే అవకాశమున్నప్పటికీ చంద్రబాబు ఎప్పటిలానే వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారానే దర్శనానికి వెళ్లారు. ఉదయం 8.28 గంటలకు మహద్వారం వద్దకు చేరుకున్న సీఎంకు టీటీడీ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. దర్శనం తర్వాత రంగనాయక మండపంలో వేదాశీర్వచనం అందుకుని 9.19 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు. దాదాపు 40 నిమిషాల పాటు సీఎం కుటుంబం ఆలయంలో గడిపింది.అంతకు అరగంట ముందే ఏర్పాట్ల పర్యవేక్షణకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆలయంలోకి వెళ్లారు. సీఎం రాకకు ముందే టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కూడా ఆలయంలోకి వెళ్లారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూడా వైకుంఠం కాంప్లెక్స్ ద్వారా ముందే ఆలయంలోకి వెళ్లారు. సీఎం కుటుంబం ఆలయంలోకి వెళ్లిన తర్వాత తిరుపతి, చంద్రగిరి, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, మురళీ మోహన్ లోపలికి వెళ్లారు. ఆ తర్వాత మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాసులు, శ్రీధరవర్మ, అన్నా రామచంద్రయ్య, అనితా యాదవ్, హేమాంబరధర నాయుడు,బుల్లెట్ రమణ, కృష్ణయాదవ్ తదితరులు ఆలయంలోకి ప్రవేశించారు.

అన్నప్రసాదాలు వడ్డిస్తూ..

శ్రీవారి దర్శనం అనంతరం ఉదయం 9.25గంటల ప్రాంతంలో చంద్రబాబు కుటుంబం వెంగమాంబ అన్నప్రసాదానికి చేరుకుంది. తొలుత వేంకటేశ్వర స్వామి పటం వద్ద పూజలు నిర్వహించారు.ముఖ్యమంత్రిననే హోదాను పక్కనబెట్టి మనవడికి అన్నదానం ప్రాధాన్యాన్ని వివరిస్తూ, చంద్రబాబు అన్నదాన సత్రంలో భక్తుల విస్తర్లలో అన్నప్రసాదాలను వడ్డించారు. దేవాన్ష్, చంద్రబాబు, లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణిలు భక్తులకు బెల్లం పొంగలి, మసాలా వడలను అరిటాకుల్లో వడ్డించారు. ఈ సమయంలో భక్తులతో కలుపుగోలుగా మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు, అన్నప్రసాదాలు ఎలా ఉన్నాయి, ఏవైనా సమస్యలున్నాయా అని అడుగుతూ సీఎం అన్నప్రసాదాలను వడ్డించారు. అన్నప్రసాదాలు చాలా రుచిగా ఉన్నాయంటూ భక్తులు సీఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సీఎం కూడా కుటుంబ సభ్యులతో కలిసి అరిటాకుల్లో వడ్డించిన అన్నప్రసాదాలను స్వీకరించారు.

సీఎం వెంట టీటీడీ బోర్డు

తిరుమల పర్యటనలో సీఎం కుటుంబం వెంట టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా పలువురు బోర్డు సభ్యులున్నారు. బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, శాంతారాం, భానుప్రకాష్‌రెడ్డి, నరేష్, పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి ఈ కార్యక్రమంలో ఉన్నారు. ఆరణి మదన్, పులివర్తి వినీల్ అన్నదాన సత్రంలో సీఎం కుటుంబంతో పాటు ఉన్నారు.

గట్టి భద్రత- మాడవీధులు నిర్మానుష్యం

మరోవైపు సీఎం పర్యటనలో తిరుమలలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయ ప్రాంతం, మాడవీధులు రెండు గంటల పాటు నిర్మానుష్యంగా మారాయి.ఎక్కడికక్కడ గేట్లు వేయడంతో ఒకప్రాంతం నుంచి మరొకప్రాంతానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఎం ఆలయంలోకి వెళ్లిన తర్వాత కూడా అరటిమానులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌లో బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. మీడియాను కూడా గొల్లమండపానికే పరిమితం చేశారు. కాగా అన్నదాన వితరణ అనంతరం అతిథిగృహానికి చేరుకున్న సీఎంను కలిసేందుకు తిరుపతి, తిరుమల టీడీపీ కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాలతో వీరిని పోలీసులు అడ్డుకోవడంతో బయటే ఉండిపోవాల్సి వచ్చింది. అయితే తిరుగు ప్రయాణంలో సీఎం చంద్రబాబు కార్యకర్తలను చూసి కాన్వాయ్ నుంచి కిందకు దిగి వినతిపత్రాలు అందుకున్నారు. పులివర్తిని ఆప్యాయంగా పలకరించారు. అందరికీ అభివాదం చేస్తూ తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.



మూడునెలలు గుడి మూసేయాలన్నారు

● తిరుమలలో నీటి ఎద్దడి రోజులను గుర్తుచేసిన సీఎం

'గతంలో తిరుమలలో నీళ్ల సమస్య తీవ్రంగా వచ్చింది. మూడు నెలల పాటు శ్రీవారి ఆలయాన్ని మూసివేయడం తప్ప మరో దారి లేదని అధికారులు నాతో చెప్పారు. నాకు చాలా కోపం వచ్చింది. 'ఆలయాన్ని మూసివేయడం ఏంటయ్యా మీకేమైనా పిచ్చిపట్టిందా?' అని కోప్పడ్డాను. రోజుకు 600 నుంచి 800 ట్యాంకర్లను భక్తుల రాకపోకల మధ్య తిరుమలకు తీసుకొచ్చే పనులు చేయలేం అని అధికారులు నాతో అన్నారు. నేను అంగీకరించలేదు. కల్యాణిడ్యాం నుంచి తిరుమలకు నీళ్లు తీసుకువచ్చేలా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలనీ, అదీ 90 నుంచి 95 రోజుల్లో జరగాలని ఆదేశించా. లేకుంటే అరెస్ట్ చేస్తానని కూడా చెప్పా. దేవుడి కోసం కాబట్టి అందరినీ పిలిచి.. 'ఉన్న డబ్బులు ఇవే. పూర్తి చేయండి' అని కోరా. ఎల్‌అండ్‌టీ ముందుకొచ్చింది. అనుకున్న సమయానికి కళ్యాణి డ్యాం నుంచి తిరుమలకు పైప్ లైన్లు వేసింది. అంతే కళ్యాణి నీళ్లు తిరుమల కొండ మీదకి ఎక్కాయి.' అని ఒకనాటి రోజులను సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.తిరుపతి, తిరుమలలో నీటి సమస్యను పరిష్కరించేందుకు కండలేరు నీటి ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచుతారా అని మీడియా ప్రతినిధుల ప్రశ్నకు బదులిస్తూ.. 'తిరుమలకు నీళ్లు తీసుకురావడం పెద్ద సమస్యేమీ కాదు. సోమశిల, కండలేరు, బాలాజీ రిజర్వాయర్ ఉంది. కల్యాణి డ్యాం నుంచి కూడా తిరుమలకు నీళ్లు తీసుకుంటున్నాం. మల్లిమడుగు కూడా వస్తే తిరుపతికి నీటి సమస్య ఉండదు' అన్నారు. అసలు చరిత్ర ఏంటో మీరు తెలుసుకోవాలి. యువతరానికి కూడా మనం తెలియజేయాలి. తిరుపతిలో నీళ్లు లేక నిత్యం సమస్యలు ఏర్పడుతున్న క్రమంలో తెలుగు గంగను నేనే తీసుకొచ్చా అని వివరించారు.

ఎమ్మెల్యే కారును ఢీకొన్న వ్యాన్

సీఎం కాన్వాయ్‌లోని ఓ వ్యాన్ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కారును ఢీకొంది. సీఎం చంద్రబాబు తిరుగు ప్రయాణంలో పద్మావతి అతిథిగృహం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కాన్వాయ్‌తో సీఎం వాహనం ముందు వెళ్లిపోగా వెనుక వస్తున్న ఈవో కారు ఆగింది. వెనుకే వస్తున్న ఎమ్మెల్యే కారు వేగాన్ని అదుపుచేస్తూ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే కారు కూడా ఈవో కారును ఢీకొంది. ఇదే సమయంలో స్వల్పంగా పొగలు కూడా రావడంతో భద్రతాసిబ్బంది ఉలిక్కిపడ్డారు. వాహనం వద్దకు పరుగులపై చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కారు వెనుకభాగం స్వల్పంగా దెబ్బతింది. ఆ వెంటనే కార్లు అక్కడి నుంచి వెళ్లిపోయాయి.

ఆంధ్రజ్యోతి వైద్యజ్యోతి నేడే!



తిరుపతి ఇందిరా మైదానంలో నేడు, రేపు హెల్త్‌మీట్

- ప్రముఖ ఆసుపత్రులచే సిద్ధమైన హెల్త్ స్టాల్స్
- ఉచితంగా వైద్యసేవలు, మందుల పంపిణీ

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో వైద్యజ్యోతి పేరిట నేడు, రేపు మెగా హెల్త్‌మీట్ జరగనుంది. తిరుపతి తుడా కార్యాలయం సమీపంలోని ఇందిరా మైదానంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం పదిన్నర గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ వైద్యజ్యోతి ఆరోగ్య శిబిరం ప్రారంభించనున్నారు. శని, ఆదివారాల్లో జరిగే హెల్త్ మీట్‌లో నగరంలోని పలు ప్రసిద్ధ ఆసుపత్రులు, హెల్త్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో లభించే వైద్యసేవలు వివరిస్తారు. ప్రజలకు ఆరోగ్య అవగాహన కలిగిస్తారు. రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే వైద్యజ్యోతిలో రోగులను పరీక్షించి, అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారు. అదేవిధంగా కొన్నిరకాల మందులను కూడా ఉచితంగా అందించనున్నారు.



హెల్త్‌మీట్‌లో ఉచిత వైద్య సేవలు: వెంకటరమణ గుండె, మెటర్నిటీ హాస్పిటల్ స్టాల్‌లో ఈసీజీతో పాటు గుండె సంబంధిత వైద్య పరీక్షలు, తగు సూచనలు ఇస్తారు. మనోహరి రామచంద్ర హాస్పిటల్, అంకుర హాస్పిటల్స్ వారు గర్భిణులు, తల్లి కావాలనుకునే మహిళలకు ఆరోగ్య సలహాలు ఉచితంగా ఇస్తారు. గర్భం దాల్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భస్థ శిశువుల ఆరోగ్య మెలకువలను వివరిస్తారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు ఆర్థోపెడిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తారు. ఇంకా డీఎస్‌ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, యష్ హాస్పిటల్స్ శ్రీసాయి సుధా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, డీబీఆర్ అండ్ ఎస్కే క్యాన్సర్ సెంటర్, మెడిగో హాస్పిటల్స్, సన్‌ప్రైమ్ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్స్ వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేయడంతో పాటూ, తగు సలహాలు, సూచనలు చేస్తారు. కాకర్ల డెంటల్ హాస్పిటల్, క్రిష్ణతేజ డెంటల్ హాస్పిటల్స్ వారు దంత సంబంధిత సమస్యలు, అధునాతన దంత వైద్యంపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (ఎన్‌బీకే) ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పి.మనోహర్ రెడ్డి, కెపి చౌదరిలు ప్రధాన స్పాన్సర్‌లుగా వ్యవహరిస్తుండగా సీపీఆర్ కనస్ట్రక్షన్స్ వారు కో స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, తిరుపతి

నగరవనంలో చిరుత



మంగళం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కపిలతీర్థంవద్ద గల నగరవనంలో శుక్రవారం చిరుత సంచరించింది. ఉదయం 11 గంటల సమయంలో వంతెనపై సేదతీరుతూ ఉండగా సందర్శకులు చూసి భయాందోళనకు గురయ్యారు. వీరి సమాచారంతో అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని చిరుతను గమనించారు. కొద్దిసేపటికి చిరుత అటవీప్రాంతంలోకి వెళ్లిపోయింది. నగరవనంలో చిరుత కదలికలను గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు అటవీశాఖ అధికారి రమేష్ తెలిపారు. చిరుత సంచారం నేపథ్యంలో నగరవనాన్ని తాత్కాలికంగా మూత వేస్తున్నామని చెప్పారు.




సుకుమారి, డీఎస్పీ, పీటీసీ - బాలిరెడ్డి, డీఎస్పీ ఎర్రచందనం - శ్రీనివాస రెడ్డి, డీఎస్పీ, ఎర్రచందనం - రమణయ్య, ఫైర్ అధికారి - భాస్కర్ అలిపిరి ఏఎస్ఐ

పోలీస్ సేవలకు పతకాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పోలీసు, ఇంటెలిజెన్సు, అగ్నిమాపక, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం వివిధ సేవా పతకాలు ప్రకటించింది. ఎస్పీ నుంచి కానిస్టేబుళ్ల వరకు ఉత్తమ సేవా, సేవా, కఠిన సేవా పతకాలు లభించాయి. ఏటా ఈ పతకాలను ప్రభుత్వం ప్రకటించడం ఆనవాయితీ. ఎంపికైన వారిని ఉన్నతాధికారులు అభినందించారు.

● కఠిన సేవా పతకం కింద తిరుపతి ఎర్రచందనం విభాగంలోని కానిస్టేబుల్ వీఎస్ సోమశేఖర్ ఎంపికయ్యారు.



శ్రీనివాస్, ఎస్పీ, ఎర్రచందనం - వెంకటరాముడు, అదనపు ఎస్పీ, ఇంటెలిజెన్సు - వెంకట్రావు, అదనపు ఎస్పీ అడ్మిన్, ఎస్పీ కార్యాలయం - వినోద్‌కుమార్, సీఐ, సైబర్ క్రైం

ఉత్తమ సేవా పతకాలు వీరికే

తిరుపతి పీటీసీ డీఎస్పీ కె.సుకుమారి, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, బాలిరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ సంచాలకుడు జె.రమణయ్య, ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా మాణిక్యాలరావు, అలిపిరి ఏఎస్‌ఐ జి.భాస్కర్.

వీరికి సేవా పతకాలు

ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, జిల్లా పోలీసు కార్యాలయంలో అడ్మిన్ ఏఎస్పీ వెంకట్రావు, ఇంటెలిజెన్సు ఏఎస్పీ వెంకటరాముడు, తిరుపతి సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్, వెంకటగిరి ఏపీఎస్పీలో ఆర్ఐ శ్రీనివాస రెడ్డి, ఆర్ఎస్ఐ పి.రాంబాబు, వెంకటగిరిలో ఆర్ఐ జాలయ్య, ట్రాఫిక్‌లో పనిచేస్తున్న మణిగండన్, వెస్ట్ పీఎస్‌లో ఏఎస్ఐ ఎల్.మునిరత్నం నాయుడు, తడ ఏఎస్ఐ శ్రీకుమార్ రెడ్డి, భాకరాపేట హెడ్ కానిస్టేబుల్ వెంకటసిద్దారెడ్డి, తిరుపతి రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు, ఎస్వీయూ పీఎస్ కానిస్టేబుల్ వెంకటరమణయ్య, రిజర్వు హెడ్ కానిస్టేబుళ్లు బ్రహ్మనాయక్, రమేష్‌బాబు, తిరుపతి వెస్ట్ నిర్మల, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున రావు, రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ప్రసన్న ఆంజనేయులు ఉన్నారు. అగ్నిమాపక శాఖ నుంచి తిరుపతి స్టేషన్ ఫైర్ అధికారి మస్తాన్, వెంకటగిరి వి.నారాయణ, ఎస్పీఎఫ్ విభాగం హెడ్ కానిస్టేబుల్ గోపాల్ నాయుడు, టీటీడీలో ఎస్ఐగా పనిచేస్తున్న నాగభూషణ రావు, ఏఎస్ఐ రామచంద్రయ్య, దేముడు బాబు, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, శ్రీకాళహస్తి ఆలయంలో హెడ్ కానిస్టేబుల్ డి.మురళి, కె.శేఖర్ రెడ్డి, బీవీఆర్ ప్రసాద్ ఎంపికయ్యారు.

కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

● ఫేక్‌గా తేల్చిన పోలీసులు ● హైరానాపడ్డ ఉద్యోగులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. హార్దిక్ పీటర్స్ అనే వ్యక్తి మెయిల్ ఐడీ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ అధికార మెయిల్ ఐడీకి శుక్రవారం ఓ సందేశం వచ్చింది. కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు మెసేజ్ ఉండడంతో కలెక్టర్ ఎస్పీ హర్షవర్ధనరాజుకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి నేతృత్వంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు కలెక్టరేట్‌కు చేరుకుని సెల్లార్ నుంచి ఏడవ అంతస్తు వరకు 2 గంటల పాటు తనిఖీలు చేశారు. బాంబు ఆనవాళ్లు దొరక్కపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల తనిఖీలతో ఉద్యోగులు, అధికారులు కొంతసేపు హైరానాపడ్డారు. గతంలో పలు హోటళ్లకు సైతం ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం విదితమే. వరుసగా ఫేక్ మెసేజ్ చేస్తున్న ఆగంతుకుడి వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.



కలెక్టరేట్ పరిసరాలను తనిఖీ చేస్తున్న డాగ్, బాంబ్ స్క్వాడ్

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (శనివారం సాయంత్రం)
సహర్: 4:56 (ఆదివారం ఉదయం)

తిరుచ్చిపై పద్మావతిదేవి అభయం

తిరుచానూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శుక్రవారం రాత్రి అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలమూర్తికి నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిగింది. మధ్యాహ్నం తిరుమంజనం నిర్వహించారు. సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాష్కర్ నాయుడు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేట పంచాయతీకి పెరిగిన ఆదాయం

భాకరాపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేలం పాటల ద్వారా భాకరాపేట పంచాయతీకి గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.50వేల ఆదాయం పెరిగినట్లు ఈవోపీఆర్‌డీ సోమశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేలంలో వారపు సంత ద్వారా రూ.10.60 లక్షలు, ప్రైవేటు బస్టాండు ద్వారా రూ.1.02 లక్షలు, గదుల వేలం ద్వారా నెలకు రూ.2.33 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, కార్యదర్శి రామమోహన్, సర్పంచ్ భూపాల్, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, దామోదర్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

భాకరాపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరూ విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని చిన్నగొట్టిగల్లు తహసీల్దారు జనర్దాన్‌రాజు తెలిపారు. ఏప్రిల్ నుంచి రేషన్ పొందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ జాబితా సంబంధిత డీలర్ వద్ద ఉందని ఈ నెల 30వ తేదీలోపు చేయించుకోవాలని తెలియజేశారు.

తిరుపతిరూరల్: రూరల్‌మండల పరిధిలోని గ్రామాల్లో రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తహసీల్దార్ రామాంజులునాయక్ సూచించారు. ఈకేవైసీ చేసుకోని వారికి సరుకులు ఇవ్వరని తెలియజేశారు.

తిరుమలేశుడి సేవలో తెలంగాణ మంత్రి పొన్నం



తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్ర వారం వేకువజామున తిరుమల ఆలయంలో అభిషేకం సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వ చనం చేశారు. అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

చదువుతో పాటు నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

తిరుపతిరూరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువు తోపాటు నైపుణ్యాలను పెంచు కోవాలని ప్రొఫెసర్ నితిన్ కుమార్, డాక్టర్ నీలిమ తెలియజేశారు. సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజి నీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ ఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన నాలుగు రోజుల సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో వారు మాట్లాడుతూ వివిధ రంగాలలో కృత్రిమమేథ ప్రాముఖ్యతను వివరిం చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, హెడ్స్ డాక్టర్ సుజిత్, డాక్టర్ నారాయణబాబు, కో-ఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టు ఎదుట హాజరుపరిచారు. విచారించిన న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.80వేలు అపరాధం విధించారు.

మాలల సింహగర్జన వాయిదా

తిరుపతి(జీవకోన), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాయలసీమ మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న తిరుపతిలో తలపెట్టిన మాలల సింహగర్జన సభ వాయిదా వేస్తున్నట్లు గౌరవాధ్యక్షుడు అశోకరత్న తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలమాదిగల మధ్య చిచ్చుపెడుతూ ఈ వర్గీకరణను తెరపైకి తెచ్చాయన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా చేపడుతున్న దీన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో సింహ గర్జన సభను వాయిదా వేశామని, త్వరలోనే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో భద్రతా ప్రమాణాలు పాటించండి



తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జోషి

తిరుపతి(సెంట్రల్), మార్చి21 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో భద్రతా ప్రమాణాలను పాటించాలని రైల్వే బోర్డు సేఫ్టీ ఈడీ ఎస్ఎన్ జోషి సూచించారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీలు చేపట్టారు. నూతన నిర్మాణ పనులను, ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నప్ప రెడ్డి, పలు విభాగాల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా నిలవడం గొప్ప విషయం



ఎమ్మెల్యే శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి(వైద్యం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు ఉపయోగపడే కార్యాలయ భవనానికి సొంత నిధులతో మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు రుణపడి ఉంటామని ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా తెలిపారు. ఏపీ హంస ఉద్యోగ సంఘ నేతలతో కలిసి ఆయన శుక్రవారం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు ఇమ్రాన్, టాటా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్లకి నివాళి



గరిమెళ్ల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి(కల్చరల్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ పెద్దకర్మను శుక్రవారం భవానీనగర్‌లోని ఆయన నివాసంలో నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, పలువురు సంగీత విద్వాంసులు, టీటీడీ ఉద్యోగులు హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం ముందు వీణ ఏర్పాటు చేశారు. అన్నమయ్య కీర్తన పొందుపరచిన గరిమెళ్ల చిత్రపటాన్ని ఆయన కుటుంబ సభ్యులు అందజేశారు.

చంద్రగిరి

పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రామచంద్రాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఎవరైనా నిబంధనలను అతిక్ర మిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈవో కేవీఎన్ కుమార్ హెచ్చ రించారు. శుక్రవారం మండలంలోని సొరకాయలపాళెం పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ ఉన్నందున బయటి వ్యక్తులు ఎవరూ గుమికూడరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

రేపు బ్రాహ్మణ అర్చక, పురోహిత సంక్షేమ సేవా సఘం సమావేశం

చంద్రగిరి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని శ్రీవాసవి ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఏపీ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సఘం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోడూరు గౌతమ్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరు ఆంధ్రసూర్య, రాష్ట్ర అధ్యక్షుడు దుర్వాసుల రామశాస్త్రి విచ్చేయనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బ్రాహ్మణ అర్చక, పురోహితులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

దానామూర్తిపల్లెలో నారా దేవాన్ష్ జన్మదిన వేడుకలు



మిఠాయిలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కొమ్మినేని దామోదరనాయుడు

చంద్రగిరి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కల్‌రోడ్డుపల్లె పంచాయతీ దానామూర్తి పల్లెలో ప్రకృతి వ్యవసాయదారుడు కొమ్మినేని దామోదరనాయుడు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆగ్రామంలో చిన్న పిల్లలకు, గ్రామస్తులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం పూతలపట్టు, -నాయుడుపేట జాతీయ రహదారిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆ దారిలో కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్న భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

తుడా కార్యదర్శి వెంకటనారాయణ బదిలీ

తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శి డాక్టర్ జి.వెంకటనారాయణ బదిలీ అయ్యారు. పంచాయతీరాజ్ శాఖలో డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తుండిన ఆయన 2023 డిసెంబరులో డెప్యుటేషన్‌పై మున్సిపల్ పరిపాలనా శాఖకు బదిలీ అయ్యారు. ఆ మేరకు తుడా కార్యదర్శిగా నియమితులయ్యారు. వాస్తవానికి ఆయన డెప్యుటేషన్ గడువు గతేడాది డిసెంబరులోనే ముగిసింది. అయితే ఎన్నికలు తదితర కారణాలతో ఆయన తుడా కార్యదర్శి పోస్టులో కొనసాగుతూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం ఆయనను మాతృ శాఖ అయిన పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేసింది. ఆ మేరకు మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా తుడా వీసీని ఆదేశించారు.

ఎర్రావారిపాళెం ఎస్ఐ బదిలీ

ఎర్రావారిపాళెం, మార్చి 21(ఆంధ్రజ్యోతి); ఎర్రావారిపాళెం ఎస్ఐ డీవై.స్వామి బదిలీ అయ్యారు. గత ఆగస్టులో ఆయన ఇక్కడికి వచ్చారు. పాలనా బదిలీల్లో భాగంగా ఆయన్ను కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడికి ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. వారంలోపు అనంతపురం నుంచి ఇక్కడికి ఎస్ఐ రానున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్రకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

పలమనేరు బాలాజీకి గీతాంజలి స్మారక పురస్కారం

పలమనేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎరుకల కథాసంపుటి 'ఏకలవ్య కాలనీ' రచయిత పలమనేరు బాలాజీ గీతాంజలి స్మారక సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కరణం విమల బాలాజీకి వివరాలు తెలియజేశారు.

మామిడి కాయలకు కవర్లు కట్టండి
ప్రభుత్వం రాయితీ ఇస్తుంది



మామిడితోటలో కవర్ కట్టిన విధానాన్ని పరిశీలిస్తున్న శైలజ

చంద్రగిరి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మామిడిలో టేబుల్ రకాలైన బేనిషా, మల్లిక, రసాలు, పెద్ద నీలం, నీలం, ఖాదర్, హిమాయత్ పసంద్, కలర్ తోతాపురి రకాలకు ఫ్రూట్ కవర్స్ కట్టే విధానాన్ని మామిడి రైతులు అనుసరించాలని, ఇందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ఉద్యాన అధికారి శైలజ తెలియజేశారు. శుక్రవారం మండలంలోని తొండవాడలో మామిడి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగు, టెంక పురుగు, పండు ఈగ, తెగుళ్లు, ఎండ తీవ్రత, వడగండ్ల వాన నుంచి కాయలను కవర్లు కాపాడుతాయని వివరించారు. కాయ కోడిగుడ్డు పరిమాణంలో ఉండగా కవర్లు కట్టాలని సూచించారు. 50 రోజుల తర్వాత కోయాల్సి ఉంటుం దన్నారు. ఇలాంటి పండ్లకు మంచి ధర వస్తుందని తెలియజేశారు. నాలుగు పరిమాణాల్లో కవర్లు ఉన్నాయని తెలిపారు. ఒక ఎకరాకు రూ.4 వేలు, గరిష్ఠంగా 2.5 ఎకరాలకు రూ.10 వేల రాయితీని ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు లత, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముంతాజ్ హోటల్ నుంచి వైసీపీకి ముడుపులెంతో?



మీడియాతో మాట్లాడుతున్న మునికృష్ణ, టీడీపీ నేతలు

తిరుపతి(జీవకోన), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ముంతాజ్ హోటల్‌ను తిరుపతిలో ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చింది వైసీపీ ప్రభుత్వమేనని, వారి నుంచి మాజీ సీఎం జగన్ ఎంత ముడుపులు తీసుకున్నారో చెప్పాలని డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ముంతాజ్ హోటల్‌తో పాటు మరో రెండు ప్రైవేటు హోటల్స్‌కు కేటాయించిన స్థలాన్ని రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం ప్రకటించడం హర్షణీయమని తెలిపారు. తిరుపతి, తిరుమల పవిత్రతను దృష్టిలో పెట్టుకుని సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. అయితే సాధువులను చూసి భయపడి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారంటూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీపై రాద్ధాంతం చేస్తున్న వైసీపీ నేతలు గతంలో వారు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేశారా అని నిలదీశారు. రాజకీయాలు హుందాగా చేయాలని హితవుపలికారు. రూ.కోటి విలువ చేయని డబుల్ డెక్కర్ బస్సును రూ.1.20కోట్లకు కొన్నారన్నారు. పైగా ఆ బస్సు కోసం తిరుపతిలో ఉన్న చెట్లను కొట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, కరాటే చంద్ర, శ్రీరాములు, గంజి సుధాకర్‌రెడ్డి, సుబ్బుయాదవ్, ధనంజయ, నాగప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జన్యుపరమైన లోపాలపై శ్రద్ధ పెట్టాలి



మాట్లాడుతున్న చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్

తిరుపతి(వైద్యం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జన్యుపరమైన లోపాలతో పుట్టిన చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ పేర్కొన్నారు. ప్రపంచ డౌన్స్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా రుయా చిన్నపిల్లల విభాగంలోని డైస్ భవనంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ (జన్యుపరమైన లోపాలు)తో పుట్టిన చిన్నారుల్లో తలతోపాటు చెవులు, మెడ చిన్నవిగా ఉంటాయని, ముఖం ఫ్లాట్‌గా ఉంటుం దని, ఎదిగే సమయంలోనూ అభ్యాసన సామర్థ్యాలు నెమ్మదిగా ఉంటాయన్నారు. వారిని సంరక్షించే విషయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మధుసూదన్, చిన్నపిల్లల వైద్య నిపుణులు ప్రదీప్, గుణశేఖర్ పాల్గొన్నారు.

జీవన శైలితో క్యాన్సర్‌ను అధిగమిద్దాం



మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మహిళలు చక్కటి జీవన శైలి, ఆహార అలవాట్లు, వ్యాయామంతో క్యాన్సర్‌ను అధిగ మించ వచ్చునని టాటా క్యాన్సర్ ట్రస్ట్ అధికారి హేమంత్‌కుమార్ అన్నారు. శివజ్యోతినగర్‌లోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు కుటుంబ నిర్వహణలో ఆహార అలవాట్లను నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. మూడేళ్లుగా రాస్ సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సకాలంలో పరిమితంగా ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. అనంతరం 150 మంది మహిళలకు బీపీ, షుగర్, నోరు, రొమ్ము, గర్భసంచి పరీక్షలు నిర్వహించారు.

పాలారుపై చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు రూ.10.24 కోట్లు

కుప్పం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ పరిధిలో పాలారు నదిపై ఉన్న నాలుగు చెక్‌డ్యామ్‌ల మరమ్మతు లకోసం ప్రభుత్వం రూ.10.24 కోట్లను మంజూరు చేసింది.నదిపై 8.8వ కిలోమీటరు వద్ద చెక్ డ్యామ్ మరమ్మతులకు రూ.1.9 కోట్లు, 12.250వ కిలోమీటరు వద్ద ఉన్న చెక్‌డ్యామ్ మరమ్మ తులకు రూ.2.18 కోట్లు, 13.9వ కిలోమీటరు వద్ద ఉన్న చెక్ డ్యామ్ మరమ్మతులకు రూ.1.71 కోట్లు ,429.5వ కిలోమీటరు వద్ద కుప్పం మండల పరిధిలోని చెక్ డ్యామ్ పునర్నిర్మాణానికి రూ.4.45 కోట్లు మంజూర య్యాయి.

రుయా పెస్ట్ ఏజన్సీపై చీటింగ్ కేసు

తిరుపతి(వైద్యం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో పెస్ట్ కంట్రోల్ నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన సాయి సెక్యూరిటీ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ స్వామిరెడ్డిపై శుక్రవారం వెస్ట్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. రుయా, ప్రసూతి ఆస్పత్రులతో పాటు ఎస్వీ వైద్య కళాశాల పెస్ట్ కంట్రోల్ సర్వీసెస్ నిర్వహించేందుకు 2021లో సాయి సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టు దక్కించుకుంది. అయితే ఆ కాంట్రాక్టును సబ్ కాంట్రాక్టు కింద తిరుపతికి చెందిన ఎన్.రేణుకకు ఆ బాధ్యతలను అప్పగించారు. కాంట్రాక్టు నిబంధనల మేరకు 39 నెలలకు సంబంధించిన బ్యాంకు గ్యారెంటీలను ఆమె ఫిక్స్‌డ్ డిపాజిట్ కింద చెల్లించారు. 13 నెలల తర్వాత సబ్ కాంట్రాక్టరు రేణుకను సాయి సెక్యూరిటీ ఏజెన్సీ ఆ బాధ్యతల నుంచి తప్పించి ఆ బాధ్యతలను వేరొకరికి అప్పగించింది. తాను చెల్లించిన బ్యాంకు గ్యారెంటీలను మాత్రం నాలుగేళ్లుగా చెల్లించలేదు. పలుమార్లు సాయి సెక్యూరిటీ ఏజెన్సీ వారిని, రుయా అధికారులను కోరినా చెల్లించలేదు. దీంతో ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీఎంఐసీడీసీ ఎండీలకు ఫిర్యాదు చేయడంతోపాటు వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇది నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని, దీని ఆధారంగా ఏజన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

ముంతాజ్ హోటల్ రద్దును స్వాగతిస్తున్నాం

తిరుపతి(జీవకోన), మార్చి 21(ఆంధ్రజ్యోతి): అలిపిరికి సమీపంలో ముంతాజ్ హోటల్ నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని మాజీ టీటీడీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధువుల పోరాట ఫలితంగానే అనుమతులను రద్దు చేశారన్నారు.

ఈ నిర్ణయం శుభపరిణామం

అలిపిరి జూపార్కు సమీపంలో దేవలోక్, ముంతాజ్ హోటల్ లాంటి ప్రైవేటు సంస్థలకు గతంలో కేటాయించిన సుమారు 30 ఎకరాల స్థలాన్ని రద్దు చేస్తున్నట్లు శ్రీవారి సన్నిధిలో సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడం శుభపరిణామని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో భక్తుల రద్దీని అధిగమించేలా 40 సంవత్సరాల ముందస్తు ప్రణాళికతో భక్తుల వసతి సముదాయాల కోసం జూపార్కు రోడ్డులో రిజర్వుడు స్థలాలను టీటీడీ భద్రపరచుకోవాలని సూచించారు. శేషాచల కొండలను ఆనుకుని ఎలాంటి ప్రైవేటు నిర్మాణాలు చేపట్టకూడదని టీటీడీ తీర్మానం చేసి ప్రభుత్వ అనుమతి పొందాలన్నారు.

సీఎం ప్రకటన హర్షణీయం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ముంతాజ్ హోటల్ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయించడం హర్షణీయమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. అలిపిరి పరిసర ప్రాంతాలను వ్యాపార, వాణిజ్య కేంద్రాలుగా మార్చితే తిరుమల పవిత్రతతకు, ఆధ్యాత్మికతకు భంగం వాటిల్లుతుందన్నారు.

సీఐటీయూ హర్షం

తిరుపతి(ఆటోనగర్) మార్చి21(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కేటాయించిన 35 ఎకరాల భూముల లీజును ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రద్దు చేయడం హర్షణీయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టార్ హోటల్ నిర్మించాలంటే వేరేచోట స్థలాన్ని కేటాయించాలని, టీటీడీ భూములు కేటాయించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

కూలీలు దొరక్క.. సాగునీరు అందక..!


- ఆర్‌సీపురంలో సగానికి తగ్గిన సాగు
- మామిడి తోటలుగా మారిన పొలాలు
- వెంచర్లుగా మారుతున్న భూములు

రామచంద్రాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శాశ్వత నీటి వనరులు లేకపోవడంతో పాటు పంట పెట్టుబడి విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఆర్‌సీపురం మండలంలో సాగు సగానికి పైగా తగ్గిపోయింది. మండలంలో చిన్నా, పెద్ద 16 చెరువులు ఉన్నప్పటికీ రాయలచెరువు మినహా మిగిలిన చెరువులు నీరు అందించే పరిస్థితి లేదు. వర్షాకాలంలో నీరు చేరినా చెరువుల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వాలు గాలికి వదిలేయడంతో కొన్నాళ్లకే నీరు ఇంకిపోతోంది. ఖరీఫ్ తరువాత రబీ సాగు ఏ యేటికి ఆ ఏడాది గణనీయంగా తగ్గుతోంది. ఉపాధిహామీ పథకం వచ్చిన తరువాత వ్యవసాయానికి కూలీలు దొరకని పరిస్థితి. పంట సాగు సమయానికి కూలీలు దొరకడం లేదు. దీంతో రైతులు నారాయణవనం, నాగలాపురం, వెదురుకుప్పం మండలాల నుంచి ఎకరాకు కొంత సొమ్ము కాంట్రాక్టు పద్ధతిన ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు.

పెట్టుబడి రెట్టింపు

30 ఏళ్ల క్రితం వరకు అందుబాటులో ఉన్న వనరులతో సాగు అయ్యే వరి, వేరుశెనగ పంటలకు ప్రస్తుతం ఎకరాకు రూ.30వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో రైతులు సంప్రదాయ పంటలు మానేస్తున్నారు. మండలంలో 9 వేల ఎకరాల సాగు భూములు ఉండగా 20 ఏళ్ల క్రితం దాదాపు అంతా సాగు అయ్యేది. ప్రస్తుతం సగానికిపైగా తగ్గిపోయింది. గత ఖరీఫ్‌లో 1,850 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యేవి. ప్రస్తుత రబీలో 1,650ఎకరాలు మాత్రమే సాగులో ఉంది. అలాగే నష్టాలు భరించలేక చాలామంది రైతులు మామిడి సాగు బాటపట్టారు. 5వేల ఎకరాల్లో మామిడి సాగుచేశారు. అదేవిధంగా తమ పొలాలను రియల్టర్లకు విక్రయిస్తున్నారు. మండలంలో దాదాపు 700 ఎకరాల పొలాలు వెంచర్లు, ప్లాట్లుగా మారిపోయాయి.







బాదూరువద్ద వేసిన ప్లాట్లు, అని చెరువు, అనిచెరువుకింద బీడుగా ఉన్న వంద ఎకరాల పొలాలు


వ్యవసాయానికి ఉపాధి పనులను అనుసంధానం చేయాలి



ఉపాధిహామీ పథకం వచ్చిన తరువాత కూలీలు దొరకడం లేదు. దూరప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎరువుల వాడకం, దున్నకానికి ఎక్కువ ఖర్చులు అవుతున్నాయి. ఎకరా సాగుకు రూ.30వేలు అయితే రూ.20వేలు కూడా రావడంలేదు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి.

- హరినాయుడు, రైతు, మిట్టూరు

ఐదేళ్లుగా సాగు మానేశా



పంటకు పెట్టుబడి పెట్టడమే కానీ చేతికి వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. మా గ్రామంలో ఉన్న అన్ని చెరువుల్లో కొద్దో గొప్పో నీరు ఉన్నా కూలీలు, ఖర్చులు భరించలేక చెరువు కిందనే 150 ఎకరాల భూమిని బీడు పెట్టేశాం.

- జగన్నాథనాయుడు, రైతు, కొత్తకండ్రిగ

మఠం భవనాన్ని కాపాడండి

మంత్రి అనగానికి కార్పొరేటర్ల వినతి

తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గాంధీరోడ్డులో వందేళ్ల చరిత్ర కలిగిన హథీరాంజీ మఠం పరిపాలన భవనాన్ని కూల్చివేయాలని చూస్తున్నారని, మరమ్మతులు ఉంటే బాగుచేసి చారిత్రక ఆనవాళ్ల దెబ్బతినకుండా కాపాడాలని కూటమి నేతలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో మంత్రిని కూటమి కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్రనాథ్, అన్నా అనితలు కలిసి వినతిపత్రం అందజేశారు. మఠం భవనం చుట్టూ 120 షాపులు ఉన్నాయని, స్థానికులు మఠానికి నెలవారీ అద్దె చెల్లిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రాచీనకట్టడం పడిపోతుందన్న నెపంతో కలియుగ వెంకటేశ్వర స్వామి జ్ఞాపకాలను చెరిపేసే ప్రయత్నం మఠం అధికారులు చేస్తున్నారని ఆరోపించారు. మఠం భవనాన్ని కూలదోసే నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


మంత్రి అనగానికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, అన్నా అనిత తదితరులు

కాలానుగుణంగా రచనల అర్థం మారుతుంది

ప్రముఖ సాహిత్య విమర్శకులు తిరుపతిరావు


సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ తిరుపతిరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఒక రచన ఇప్పుడు ఒక విధంగా అర్థమైతే, పదేళ్ల తర్వాత మరో రకంగా పాఠకుడికి అర్థం కావచ్చని ప్రముఖ సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ బి.తిరుపతిరావు అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ ఇంగ్లిషు విభాగం శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. ప్రపంచంలోని ఏ మూలన ఉన్న సాహిత్యాన్ని చూసినా చెమట, కన్నీళ్లు, రక్తం తప్పక ఉంటాయన్నారు. ఇదే గొప్ప సాహిత్యంగా గుర్తింపు పొందిందన్నారు. ప్రఖ్యాత రచయిత షేక్స్‌పియర్ నాటకాలు కూడా దీనికి మినహాయింపు కాదన్నారు. సాహిత్యం కూడా ఒక శాస్త్ర ప్రమాణాలతో వెలువడుతుందన్నారు. సమాజంలో, సాహిత్యంలో వస్తున్న నూతన ధోరణులు సాహిత్య పరమార్థాన్ని మారుస్తున్నాయని తెలిపారు. తెలుగులో రామాయణం వస్తే, కన్నడలో భీమాయణం వచ్చిందన్నారు. సమాజ పరివర్తన కోసం రచనలు చేయాల్సిన అవసరం ఉంటుందని కోరారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ సమాజంలో వస్తున్న అనేక మార్పులు సాహిత్య రంగంలోనూ కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ వాణి, సెమినార్ కన్వీనర్ వైఎస్ శారద, కో-కన్వీనర్ నిర్మల, తుమ్మపూడి భారతి, మధుజ్యోతి, కుసుమ హరనాథ్, సుమకిరణ్ పాల్గొన్నారు.

మరిన్ని మలబార్ షోరూంలు ప్రారంభం

తిరుపతి అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ దేశంలో మరిన్ని షోరూంలు ప్రారంభించనున్నట్లు తిరుపతి హెడ్ రిజీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రాలో కొత్తగా నంద్యాల, అమలాపురం, వివిధ రాష్ట్రాల్లో మరో 10 షోరూంలు, అలాగే ఈ ఏడాదిలోపు మరో 60షోరూంలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. తిరుపతి నగర ప్రజల సౌకర్యార్థం రెండో షోరూం త్వరలో అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము, చంద్రగిరి

తిరుపతి జిల్లా , చంద్రగిరి మండలం, చంద్రగిరి గ్రామ పంచాయతీ

వేలము నోటిఫికేషన్

రె.క. నెం. 13/వేలములు/2025 — తేది: 17-03-2025

ఇంతకు పూర్వము ఇందు నిమిత్తము జారీ చేయబడిన యావత్తు నోటిఫికేషన్ మరియు నిబంధనలు ఇందుమూలముగా రద్దు గావించబడి ఈ నోటిఫికేషన్ చంద్రగిరి గ్రామ పంచాయతీచే తీర్మానము సంఖ్య 85 & 86, తేది: 13-03-2025 గల తీర్మానము నందు ఆమోదించబడినది.

2025 సంవత్సరము ఏప్రిల్ నెల 1వ తేదీ మొదలు 2026 సంవత్సరము మార్చి నెల 31వ తేదీ వరకు కూడిన ఒక సంవత్సరము కాలమునకు చంద్రగిరి గ్రామపంచాయతీకి చెందిన ఈ క్రింద తెలియజేసిన ఆదాయ వనరుల యందు (Remunerative Enterprises) రుసుములు వసూలు చేయు హక్కును 26/03/2025వ తేదీ బుధవారం ఉదయం 11:00 గంటలకు చంద్రగిరి గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద సదరు పంచాయతీ కార్యదర్శి వారిచే లీజు ఇచ్చుటకు బహిరంగ వేలము వేయబడును. వేలము నందు హెచ్చు పాటదారులు గ్రామ పంచాయతీచే ఖాయపరచబడిన తదుపరి 7 దినములలోపు పూర్తి పైకము చెల్లించి మరియు నూటికి రూ.2/- వంతున స్టాంపు డ్యూటీతో రిజిష్టర్ అగ్రిమెంట్ చేసుకొనవలయును. మరియు T.D.S., G.S.Tలు చెల్లించి తగు రసీదులు పొందవలయును. అట్లు చేయనియెడల వేలమును రద్దు పరచి మరు వేలము వేయబడును. సదరు వేలము నందు పాల్గొనువారు వాటి ఎదురుగా తెలిపిన ప్రకారం ధరావత్తు మొత్తమును ముందుగా **పంచాయతీ కార్యదర్శి, చంద్రగిరి** వారి పేరిట డి.డి.(డిమాండ్ డ్రాఫ్ట్)ల రూపములో మాత్రమే చెల్లించి వేలము నందు పాల్గొన వచ్చును. సదరు వేలము నందు పాల్గొను వారు గ్రామపంచాయతీకి ఎలాంటి బాకీ ఉండరాదు.

చెల్లించవలసిన ధరావత్తు వివరములు

క్ర.సం.	గుత్త వివరములు	చెల్లించవలసిన ధరావత్తు రూ.
ఈ క్రింద తెలియజేసిన క్రమసంఖ్య 1 నుండి 3 వరకు ఉదయం 11:00 గంటలకు వేలము నిర్వహించబడును		
1.	వారపు సంత	9,00,000
2.	ప్రైవేటు బస్టాండు (APSRTC బస్టాండ్ మినహా)	3,00,000
3.	జంతు వధశాల	40,000
ఈ క్రింద తెలియజేసిన క్రమసంఖ్య 4 నుండి 8 వరకు మధ్యాహ్నం 3:00గంటలకు వేలము నిర్వహించబడును		
4.	ఆర్.ఓ వాటర్ ప్లాంట్ ధర్మరాజుల గుడి వీధి	50,000
5.	ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ గాంధీ వీధి	50,000
6.	ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ కోట గ్రామము	5,000
7.	ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ఇందిరమ్మ కాలనీ	5,000
8.	టాయిలెట్స్	2,000

షరా:- * మిగతా వివరములు మరియు వేలపు షరతులు నియమ నిబంధనల కొరకు కార్యాలయ పనివేళలందు సంప్రదించగలరు.
* సదరు వేలము పాటను ఏదేని కారణము చూపకనే వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు మరియు మరు వేలము జరుపుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

సం/- శ్రీ కె.వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి (I/C) గ్రామ పంచాయతీ, చంద్రగిరి

సం/- శ్రీమతి యం.రూప, సర్పంచ్, గ్రామ పంచాయతీ, చంద్రగిరి

బకాయిలకు నిధులివ్వండి

సీఎం చంద్రబాబుకు ఎస్వీయూ అధికారుల వినతి


సీఎం చంద్రబాబుకు విన్నవిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డు ఉద్యోగుల బకాయిలు చెల్లించేందుకు నిధులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ఎస్వీ యూనివర్సిటీ అధికారులు విన్నవించారు. రేణిగుంట విమానాశ్రయంలో కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు యూనివర్సిటీ ఆర్థిక పరిస్థితిని సీఎంకు వివరించారు.

చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం


సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ సుమతి, డాక్టర్ కలీముల్లా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో కూడిన ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యంతో పాటు ఆదాయం కలుగుతుందని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కలీముల్లా పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ఆర్ఏఆర్ఎస్‌లో దళిత మహిళలకు చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీపై నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. డాక్టర్ కలీముల్లా మాట్లాడుతూ చిరుధాన్యాల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయన్నారు. వీటితో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దీన్ని మహిళలు ఒక ఆదాయ వనరుగా భావించి ఆహార ఉత్పత్తుల తయారీ చేయవచ్చన్నారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీ డాక్టర్ సుమతి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే బీపీ, షుగర్ దరిచేరవన్నారు. శరీరంలో అధిక కొవ్వును అరికట్టవచ్చన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న మహిళలకు కిట్, సర్టిఫికెట్‌తో పాటు కొర్ర రవ్వ, రాగిమాల్ట్, జొన్న, రాగితో తయారు చేసిన ఆహార పదార్థాలను అందజేశారు.

సెంచురీ మ్యాట్రెస్ స్టోర్ ప్రారంభం


స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సెంచురీ మ్యాట్రెస్ స్టోర్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. సెంచురీ మ్యాట్రెస్ ఈడీ ఉత్తమ్‌మలాని, తిరుపతి స్టోర్ ఇన్‌చార్జ్ నాగసాయి మాట్లాడుతూ ఆంధ్రాలో మూడవది, రాయలసీమలో తొలి షోరూంను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రారంభ ఆఫర్లుగా రూ.64,999 విలువైన ఫర్నీచర్ కొనుగోలుపై గ్రాము బంగారు నాణెం ఉచితంగా ఇస్తామని చెప్పారు. రూ.99,999 కొనుగోలుపై 1.5టన్నుల 3 స్టార్ ఏసీ ఉచితమని తెలిపారు. ఈ ఆఫర్లు 15 రోజుల వరకు మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, ఎమ్మెల్యే తనయుడు మదన్, ఎడిఫై స్కూల్ చైర్మన్ ప్రణీత్, టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు అధ్యక్షుడు ఆర్.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

అవగాహనా ఒప్పందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తిరుచిరాపల్లెకు చెందిన క్లై కావేరీ కాలేజీతో ఎస్వీయూ లలిత కళల విభాగం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇరుసంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై శుక్రవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాల్లో పరస్పర సహకరించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఫైన్ ఆర్ట్స్ హెడ్ డాక్టర్ శంకర్ గణేష్, క్లై కావేరీ కాలేజీ అధ్యాపకురాలు ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, ఎస్వీయూ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, డాక్టర్ ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

సీబీఎస్ ఇన్నర్‌వే విస్తరణ

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టేషన్ లోపలికి ప్రవేశించే మార్గాన్ని విస్తరిస్తున్నారు. ఫ్రీలెఫ్ట్ సౌకర్యం లేకపోవడం, దారి ఇరుకుగా ఉండడంతో ఆటోలు, ఇతర వాహనాలు ఎదురుగా వస్తున్నప్పుడు బస్సులు ఆగాల్సి వస్తోంది. దీంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ యంత్రాంగం ప్రధాన రోడ్డు నుంచి 130 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పుతో విస్తరణ పనులు చేపట్టింది. బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, ఈఈ లక్ష్మీనారాయణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఒంటిపూట బడులు సక్రమంగా అమలు కావడం లేదు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒంటిపూట బడులు సక్రమంగా అమలు కావడంలేదని విద్యార్థి సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం వారు డీఈవో కేవీఎన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఈనెల 15 నుంచి ఒక పూట బడుల నిర్వహణ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో అమలు కావడంలేదన్నారు. వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రియాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, విద్యార్థి సంఘాల నాయకులు యుగంధర్, లోకేశ్, ముని, సుకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ పనుల ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం

తిరుపతి(క్రీడలు), మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలోని స్విమ్మింగ్‌పూల్ ఆధునికీకరణ పనుల ఆలస్యంపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహించారు. శుక్రవారం సాయంత్రం ఆయన క్రీడా సముదాయంలో పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల ఆలస్యం గురించి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆరా తీశారు. వేసవి ముగిసిన తర్వాత అందుబాటులోకి తెస్తే ఉపయోగమేమిటని ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీబీఎస్‌లో ఎటుచూసినా చెత్తే



తిరుపతి(ఆర్టీసీ), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో ఎటుచూసినా చెత్తే కనిపిస్తోంది. లోనికి ప్రవేశించే మార్గం వద్ద చెత్తకుండీలు నిండి వ్యర్థాలు కిందపడ్డాయి. పైగా ప్రయాణికులు, ఆటోవాలాలు మూత్రవిసర్జన చేస్తుండడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా తయారైంది. ఈగలు, దోమల ప్రభావం పెరిగింది. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్‌గా స్విమ్స్!

● పరిశీలించాలంటూ సీఎంకు వినతి



తిరుమల, ఆంధ్రజ్యోతి: రాయలసీమకే తలమానికమైన స్విమ్స్ ఆస్పత్రిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా పరిగణించే అంశంపై పరిశీలించాలని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. శ్రీవారి దర్శనం అనంతరం తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో సీఎంను కలిసిన ఆయన అందుకు సంబంధించిన ప్రాజెక్ట్ నివేదికను అందజేశారు. దీనిపై బోర్డులో తీర్మానం కూడా చేసి ప్రభుత్వానికి పంపామని తెలిపారు.

సాంకేతిక లోపంతో ఆగిన మెమూ రైలు

దొరవారిసత్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న మెమూ రైలు ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో శుక్రవారం సాయంత్రం దొరవారి సత్రం మండలం కలగుంట సమీపంలో ఆగిపోయింది. దీంతో ఆ మార్గంలో చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లను నిలిపివేశారు. రాత్రి 7గంటలకు ధన్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కున్న మరో ఇంజిన్‌ను తీసుకెళ్లి ఆగిపోయిన మెమూ రైలును దొరవారిసత్రం రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి లూప్‌లైన్‌లో ఉంచారు. తరువాత రాత్రి 7:30 గంటల తరువాత రైళ్ల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.




సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.71 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,872

తలనీలాలు సమర్పించినవారు: 23,523





| పల్లెలకు నిరంతరం.. రక్షిత మంచినీళ్లు అందించడమే లక్ష్యం |

నీళ్లే జీవం. నీళ్లే అభివృద్ధికి మూలం. అలాంటి మంచినీటి ప్రాముఖ్యతపై దృష్టి కేంద్రీకరించడానికి, నీటి వనరుల నిర్వహణపై చర్చించడానికి.. ఏటా మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహిస్తుంటారు.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

తాగే నీళ్లు బాగుంటే.. చాలావరకు అనారోగ్య సమస్యలు దూరమైనట్లే. అందుకనే ప్రభుత్వం రక్షిత మంచి నీటి సరఫరాకు చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా శుద్ధి నీటిని అందించే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ తీసుకొచ్చింది. దీనికి ప్రస్తుత ప్రభుత్వం సమూల మార్పులు చేస్తోంది. కొళాయిల ద్వారా 365 రోజులూ తాగునీరు సరఫరా అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సమీప జలాశయాలు, నదుల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తరలించి వేసవిలోనూ ప్రజలకు నీటిని సరఫరా చేసేలా డిజైన్లను మార్చుతోంది. రాష్ట్రస్థాయి అంచనాల కమిటీ ఆమోదంతో వాటిని త్వరలో కేంద్రానికి పంపనుంది. ఇక, జిల్లా విషయానికొస్తే.. చంద్రగిరి, నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 3,67,762 ఇళ్లున్నాయి. ఇందులో 3,45,008 ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 22,754 నీటి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వంలో ఇలా కొళాయి కనెక్షన్లు ఇచ్చారే కానీ పూర్తిస్థాయిలో నీటిని అందించ లేదు. జలజీవన్ మిషన్ కింద గత ప్రభుత్వంలో రూ.107.73కోట్లు విడుదల కాగా, రూ.65.32కోట్లు ఖర్చు చేశారు. పూర్తిస్థాయిలో రూరల్ ప్రాంతాలకు నీటిని అందించాలన్న ప్రధాన ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నీటి సరఫరా అందనని చోట నీరు అందేలా చర్యలు చేపడుతోంది. నీటి సరఫరా అందని పైపులైన్లకు సమీపంలో ఉన్న నీటి వనరుల ద్వారా నీటిని అందిస్తోంది. ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లుతో పాటు 31 మండలాల్లో ఈ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ తాత్కాలికంగా నీటి సరఫరా జరుగుతోంది. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రతిరోజు నీటిని అందించాలనే ఉద్దేశంతో రెండు కొత్త పథకాలకు రూపకల్పన చేస్తున్నారు. గండికోట రిజర్వాయర్, కండలేరు జలాశయాల ద్వారా నిరంతరం నీటిని అందించే ప్రక్రియకు డీపీఆర్‌ను సిద్ధం చేసి సంబంధితశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించగానే పనులను చేపట్టి జలజీవన్ మిషన్ ద్వారా పూర్తిస్థాయిలో నీటిని అందించనున్నారు. వేసవిలో ఇబ్బందులు ఏర్పడితే వాటికోసం కూడా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి 215.42లక్షలతో ప్రతిపాదనలు పంపారు.

పూర్తిస్థాయిలో నీటిని అందించాలన్నదే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాలకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా పూర్తిస్థాయిలో ఇంటింటికి తాగునీటిని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లకు సంబంధించి ఉన్నతాధికారులు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆమోదముద్ర పడిన వెంటనే గండికోట, కండలేరు జలాశయాల ద్వారా నిరంతరం నీటిని అందించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుంది.

- ఆర్.భాస్కర్‌రెడ్డి, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఆపరేషన్ గరుడ

● జిల్లాలో నాలుగు మెడికల్ షాపులపై అధికారుల దాడులు.. ఒకదానిపై కేసు నమోదు



తిరుపతిలోని మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ గరుడ' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నాలుగు మెడికల్ షాపులపై శుక్రవారం అధికారులు దాడులు నిర్వహించారు. తిరుపతిలో విజిలెన్సు సీఐలు నిరంజన్ నాయుడు, చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు, విజిలెన్సు, ఈగల్, డ్రగ్ కంట్రోల్ బృందాలు దాడులు జరిపాయి. తిరుపతి నగరం ప్రకాశం రోడ్డులోని గురుజ్యోతి మెడికల్ షాపులో మత్తుకోసం వాడే 15 రకాల నార్కోటిక్ డ్రగ్స్ మందులను డాక్టర్ల అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. సేల్ బిల్ వాయిస్‌లు సీజ్ చేసినట్లు సీఐ నిరంజన్ చెప్పారు. ఆ దుకాణంపై కేసు నమోదు చేస్తున్నట్లు విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ తెలిపారు. అలాగే దొడ్డాపురం వీధిలోని హోల్‌సేల్, రిటైల్ సాయి మార్కెటింగ్, అక్కడే ఉన్న సాయి మార్కెటింగ్ మెడికల్స్ అండ్ ఫ్యాన్సీ స్టోర్, రెడ్డి, రెడ్డి కాలనీలోని ఎస్వీ అపోలో ఫార్మసీ మందుల దుకాణాలపై దాడులు చేశారు. ఇక్కడా ఫార్మాసిస్టులు లేకుండా మందులు విక్రయించడం, కొన్ని నార్కోటిక్ మందులను డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఈ దాడులు నిరంతరం కొనసాగిస్తామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ చెప్పారు. ఎక్కడైనా నకిలీ మందులు, యువత, మహిళలు, రోగులు, ప్రజలకు మత్తు కలిగించే మందులు అనుమతి లేకుండా స్టాకు ఉంచినా, విక్రయించినా, డాక్టర్ల అనుమతి లేకుండా అక్రమంగా దాచి ఉంచిన మందులు విక్రయాలు జరిపినా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే మందుల దుకాణాల లైసెన్సులు రద్దు చేయడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు.

ఇకపై గంట ముందే పరీక్షా కేంద్రంలోకి అనుమతి

● ఎండ నుంచి ఉపశమనంకోసం నిర్ణయం



చంద్రగిరిలోని ఓ పరీక్షా కేంద్రం బయట ఎండలో వేచిఉన్న పదో తరగతి విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులను ఇకపై గంట ముందే కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. ఇప్పటి వరకు అరగంట ముందే అనుమతించేవారు. ఎండల నేపథ్యంలో ఉదయం 8.30 గంటల నుంచే అనుమతించేలా నిర్ణయం తీసుకున్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పదోతగతి పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులు ముందుగానే ఆయా కేంద్రాల వద్దకు చేరుకుంటున్నారు. వీరిని అరగంట ముందుగా.. అంటే 9 గంటలకు ఆయా కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు. ముందుగానే వచ్చిన విద్యార్థులు అప్పటి వరకు బయటే ఉంటున్నారు. ఇప్పుడు ఉదయాన్నే ఎండ తీవ్రంగా ఉంటోంది. దీంతో విద్యార్థులు ఎండకు ఇబ్బంది పడుతూ ఉండటాన్ని గమనించిన డీఈవో కేవీఎన్ కుమార్.. గంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి అనుమతించేందుకు నిర్ణయించారు. ఆమేరకు విద్యాశాఖాధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ప్రశాంతంగా పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు ఎండ బారినపడకుండా ఉండేందుకు ఇలా వెసులుబాటు కల్పించామని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

సత్యవేడులో టెన్త్ విద్యార్థి డీబార్

● ఇన్విజిలేటర్ సస్పెన్షన్

తిరుపతి(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి): సత్యవేడులో కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థిని అధికారులు డీబార్ చేశారు. ఇన్విజిలేటర్ ఎస్.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు. శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. అనుమానంతో ఓ విద్యార్థిని తనిఖీ చేయగా చిట్టీలు ఉండటంతో డిబార్ చేశారు. ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. ఈ ఘటన మినహా జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా సాగాయని డీఈవో తెలిపారు.

26,617 మంది హాజరు : జిల్లాలో శుక్రవారం జరిగిన ఆంగ్ల భాషా పరీక్షకు జిల్లావ్యాప్తంగా 26,617 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో కుమార్ వెల్లడించారు. రెగ్యులర్ విద్యార్థులు 26,840, ప్రైవేటు విద్యార్థులు 57 మంది పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా రెగ్యులర్ విద్యార్థులు 252 మంది, ప్రైవేటు విద్యార్థులు 28 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 966 మందికిగాను 133 మంది గైర్హాజరయ్యారు.

ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా

బరితెగిస్తున్న మాఫియా

మంగళంపాడు పొలాల్లో గుట్టలు గుట్టలుగా నిల్వలు



మంగళంపాడు పొలాల వద్ద ఇసుక నిల్వలు - ఇసుక అక్రమ రవాణాకు పొలాల్లో ఏర్పరచిన దారి

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఉచితం మాటున రెండు వారాల నుంచి కాళంగి నదిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇష్టానుసారం సాగిన ఇసుక తవ్వకాలు ప్రభుత్వం మారడంతో ఆగినట్లే కనిపించాయి. అయితే వైసీపీ హయాంలోని ఇసుక మాఫియాలో కొందరు అధికార పార్టీ నాయకులతో సంబంధాలు పెట్టుకొని అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కాళంగి నదిలో రాత్రింబవళ్లు తేడా లేకుండా ఇసుక తవ్వేస్తున్నారు. ఇందుకోసం మంగళంపాడు పొలాల్లో దారి ఏర్పరచుకొని దొరవారిసత్రం మండలం ఉచ్చూరు సమీపంలోని గుమ్మడితాగేలి వద్ద కాళంగి నదిలో ఇసుకు తవ్వి నిత్యం ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాత్రివేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించి డంపింగ్ చేసుకొంటున్నారు. అక్కడ నుంచి సమీపంలోని పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు సరఫరా చేసి జేబులు నింపుకొంటున్నారు. వారం రోజుల క్రితం మంగళంపాడులో కొందరు రైతులు తమ పొలాల మీదుగా ఇసుకను తరలించొద్దని అడ్డపడ్డారు. పోలీసులకు, ఆర్డీవో కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్ర వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం అర్ధరాత్రి పూట ఇసుక మాఫియా నాయకులు ఓ రైతు ఇంటికి వెళ్లి దుర్భాషలాడి దాడిచేసేందుకు ప్రయత్నించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నామమాత్రపు కేసులు కట్టి చేతులు దులుపుకొన్నారనే విమర్శలున్నాయి. ఇసుక అక్రమ రవాణాతో పొలాలు దెబ్బతినడంతో రైతులు అభ్యంతరం చెప్పిన అధికారులకు అక్రమార్కులకు వంతపాడుతూ సర్దుకుపోండి అంటూ నచ్చచెప్పడం గమనార్హం.

కేజే కృష్ణమూర్తి కన్నుమూత

● టీటీడీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్‌గా విశేష సేవలు
● టీటీడీ మహా భారత ప్రాజెక్టుకూ విశిష్ట కృషి
● ఎస్వీయూ ఓఆర్ఐ డైరెక్టర్‌గానూ బాధ్యతల నిర్వహణ



కేజే కృష్ణమూర్తి (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కేజే కృష్ణమూర్తి (90) కన్నుమూశారు. కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం సుంకేసుల ఈయన స్వగ్రామం. ఎస్వీ ఓరియంటల్ కాలేజీలో విద్వాన్ చదువుకోవడానికి తిరుపతికి వచ్చారు. ఎస్వీయూ తెలుగు విభాగంలో ఎంఏ తెలుగు కోర్సును ప్రైవేటుగా పూర్తి చేశారు. ఓరియెంటల్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేశారు. నంద్యాలలోని ఓ హైస్కూల్లో పదేళ్ల తెలుగు పండితుడిగా పని చేశారు. తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై ప్రొఫెసర్ జీరెడ్డి చెన్నారెడ్డి పర్యవేక్షణలో ఎస్వీయూ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ) విభాగంలో అధ్యాపకుడిగా చేరారు. ఓఆర్ఐ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు. 1996 లో పదవీ విరమణ పొందారు. 1996-2000 మధ్య కాలంలో టీటీడీ మహ భారత ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. 2004లో టీటీడీ ఏర్పాటు చేసిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా సేవలందించారు. తరిగొండ వెంగమాంబ రాసిన అనేక రచనలను పరిష్కరించారు. వీటిలో ముఖ్యంగా, వేంకటాచల మహాత్మ్యం, ద్విపద భాగవతం, యక్షగానాలు వంటివి ఆయన ద్వారా వెలుగులోకి వచ్చాయి. కేజే కృష్ణమూర్తి సతీమణి నాగసుదర్శనమ్మ 2004లో మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు శ్రీధర్ ఎస్వీఎస్ కాలేజీలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా, పార్థసారథి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈయన సోదరుడు జూలకంటి బాలసుబ్రమణ్యం సప్తగిరి పత్రిక సంపాదకుడిగా పని చేశారు. కపిలతీర్థం రోడ్డులోని రామచంద్ర నగర్‌లో నివాసమున్న కేజే కృష్ణమూర్తి, ఆరు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో కన్నుమూశారు. శనివారం ఉదయం 11 గంటలకు హరిశ్చంద్ర శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.





విమానాశ్రయంలో సీఎంకు వీడ్కోలు పలుకుతున్న డీఐజీ, కలెక్టర్, ఎస్పీ

సీఎంకు సాదర వీడ్కోలు

రేణిగుంట, మార్చి 21, (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు. శుక్రవారం మనవడు దేవాన్ష్ జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న అనంతరం తిరుమల నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రికి తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, భానుప్రకాష్, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టీటీడీ ఈవో శ్యామల రావు, డీఐజీ షిమోషీ బాజ్‌పాయి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు వీడ్కోలు పలికారు.

తిరుమలలో ఆగిన ఆఫ్‌లైన్ అద్దె చెల్లింపులు

తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆఫ్‌లైన్ ద్వారా జరిగే అద్దె చెల్లింపులు ఆగిపోయాయి. టీటీడీకి చెందిన నివాసగృహాలు, కార్యాలయాలు, దుకాణాలు, హాకర్ లైసెన్సుల అద్దెతో పాటు కరెంటు, నీటి బిల్లులను తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ద్వారా ఆఫ్‌లైన్‌లో చెల్లిస్తుంటారు. దుకాణాల అద్దె ద్వారా రోజుకు సుమారు రూ.40 లక్షలు, విద్యుత్ బిల్లుల ద్వారా రూ.20 వేల నుంచి రూ.30 వేలు (చివరి తేదీ అయితే రూ.లక్ష) వరకు వసూలు అవుతుంటుంది. ఇక నివాసగృహాలు, కార్యాలయాలు, మఠాల నీటి బిల్లులు నెలకు దాదాపు రూ.20 లక్షల వరకు చెల్లిస్తుంటారు. ఆన్‌లైన్‌లోనే చెల్లించాలనే నిబంధనతో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఈ కౌంటర్‌లో ఉన్న సిస్టమ్‌కు గురువారం నుంచి యాక్సెస్‌ను కట్ చేశారు. దీంతో కౌంటర్ వద్దకు బిల్లులు చెల్లించేందుకు వెళ్లిన వారికి ఆఫ్‌లైన్ ద్వారా కట్టించుకోవడం లేదని సిబ్బంది చెప్పి పంపేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు తెలియని అనేక మంది ఆగచాట్లు పడుతున్నారు. కొందరు బిల్లుల కంటే అధికంగా చెల్లించి ఇతరుల వద్ద బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమలలో వ్యాపారాలు చేసేవారిలో చాలా మంది చదువుకోని వారే ఉండటంతో ఆన్‌లైన్‌లో బిల్లులు కట్టేలేక ఇబ్బంది పడుతున్నారు. మరి కొందరు తమ బిల్లులు కట్టించుకోవాలని కౌంటర్ చుట్టూ తిరుగుతున్నారు.



ఆఫ్‌లైన్ ద్వారా కట్టించుకోవడం లేదని బిల్లు చూపిస్తున్న స్థానికుడు

పని ఒత్తిడి తగ్గించండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలని జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వేలు, పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సెలవు, పండుగ రోజుల్లోనూ సర్వేలు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపశమనం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు జి.శ్రీనివాసులు, గిరిధర్ రెడ్డి, మాధవి, రాజేష్, నాగవేణి, బాబునాయుడు, దుష్యంత్‌రెడ్డి, మధు, బాలాజీ పాల్గొన్నారు.



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పర్యావరణ పరిరక్షణలో అడవులే కీలకం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, జీవుల మనుగడలో అడవులు ఎంతో కీలకమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. గురువారం వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష, జంతుశాస్త్ర శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అడవులు ఎంతో కీలకమని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవులు లేకపోతే కాలుష్యం పెరగడమే కాకుండా వర్షపాతం తగ్గిపోతుందన్నారు. అనంతరం విద్యార్థులకు అడవుల పరిరక్షణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విక్టోరియా రాణి, శ్రీనివాస్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పోలేరమ్మ ఆర్చి నిర్మాణం

దారిలేక పట్టణవాసుల ఇబ్బందులు


ఆర్చి పక్కన ఇరుకు దారిలో వెళ్తున్న వాహనదారులు

వెంకటగిరి టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాస్‌రోడ్డులో చేపట్టిన పోలేరమ్మ ఆర్చి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది డిసెంబరు 14న ఆర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. 50 రోజుల క్రితం ఆర్చి శ్లాబ్ నిర్మించారు. అప్పటి నుంచి ఎటువంటి పనులు జరగంలేదు. పైగా దారిలో వాహనాలు, పాదచారులు వెళ్లకుండా ఇసుక అడ్డంగా పోశారు. దీంతో దారిలేక ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. వెంటనే పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో ధర్నా


డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

గూడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నా శుక్రవారం నాలుగోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గూడూరు డిపో మేనేజర్ ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు వైఖరి మార్చుకోవాలన్నారు. డిపోలో సర్వీసుల సంఖ్యను తగ్గించే ప్రక్రియను మానుకుని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే రెస్ట్‌రూం ఏర్పాటు చేయాలని, గూడూరు నుంచి తిరుమల, బెంగళూరుకు బస్సులను నడపాలని కోరారు. కార్యక్రమంలో అహ్మద్, శ్రీనివాసులు, కృష్ణ, గోపాల్, మస్తాన్, ఉమామహేశ్వరి, పార్వతి, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు


బ్రోచర్లను విడుదల చేస్తున్న పాఠశాల సిబ్బంది

గూడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టినట్టు గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో హైదరాబాదుకు చెందిన ఈ - అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో ఒలంపియాడ్ బోధనకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లో శిక్షణ అందజేసేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాయిరాంకృష్ణ, శ్రీహరి, రఫీ, సుప్రజ, రజని, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ జరపాలి

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట అంబేడ్కర్ బాలికల గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తేరే సూర్య ఒక ప్రకటనలో కోరారు. సూళ్లూరుపేట గురుకులంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పీఏసీఎస్, వ్యవసాయశాఖ అధికారులు

చిల్లకూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద పీఏసీఎస్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఏవో భవానీ తెలిపారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో రాజనేని రామయ్య నాయుడు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున్, శివశంకర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

శీతల యాగం

వెంకటగిరి టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బంగారుపేట బీసీ కాలనీలోని విష్ణుదుర్గ పరమేశ్వరి శక్తిపీఠంలో స్వామి వివేకానంద యువసైన్యం వ్యవస్థాపకుడు పీపీ ప్రకృతికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం శీతల యాగం నిర్వహించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, రైతులు పాడి పంటలతో సుభిక్షింగా ఉండాలని శీతల యాగం చేయించామని ప్రకృతికుమార్ చెప్పారు.

హడలెత్తిస్తున్న హైవే

- వరుస ప్రమాదాలతో బెంబేలు
- 50 రోజుల్లో 10 మంది మృతి

పెళ్లకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించిన ఆరు వరుసల 71వ జాతీయ రహదారి ప్రయాణికులను బెంబేలెత్తిస్తోంది. వాహనాల అతివేగం కారణంగా తరచూ ఏదో ఒక చోట ప్రమాదం సంభవిస్తోంది. ఇప్పటికే పది మంది మృత్యువాత పడగా ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల, తిరుపతి పుణ్య క్షేత్రాలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం, కాంచిపురం, తిరుత్తణి, తిరువళ్లూరు, శ్రీపురం, తిరువణ్ణామలై లాంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు వెళ్లే మార్గం రెండు లేన్‌లుగా ఉండేది. వాహనాల రద్దీ పెరగడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకునేవి. దీంతో నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు 57 కిలో మీటర్ల రహదారిని రూ.1931 కోట్ల వ్యయంతో సిక్స్ లేన్‌గా మార్చారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తవడంతో అనధికారికంగా వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. అయితే రహదారికి ఇరువైపులా రక్షణ డివైడర్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. సర్వీస్ రోడ్డు కూడా కొన్నిచోట్ల పూర్తి కాలేదు. రోడ్డు భద్రతా ప్రమాణాలు తెలిపే సూచిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా వేగ నిర్ధారణ కెమెరాలు అమర్చినా అవి పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో వాహన చోదకులు అతి వేగంగా వెళుతున్నారు. దీనికి తోడు నాయుడుపేట నుంచి పెళ్లకూరు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట వరకు జాతీయ రహదారికి సమీపంలోని గ్రామాల ప్రజలు రోడ్డుపైకి చేరాలంటే రాంగ్ రూట్లో వెళ్లాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో అకస్మాత్తుగా మనిషో.. పశువో అడ్డొస్తే వాహనదారులు వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే అతివేగం, మద్యం తాగి, విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడం, నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల ప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఎక్కువగా ఆగివున్న వాహనాలను వెనుక నుంచి ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సిక్స్ లేన్‌గా నిర్మాణం పూర్తయి జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు ప్రారంభమైన తరువాత పెళ్లకూరు మండలంలో గడిచిన 50 రోజుల్లో జరిగిన ప్రమాదాల్లో పది మంది మృతి చెందగా, 25 మంది గాయపడ్డారు.


దొడ్లవారిమిట్ట వద్ద జరిగిన ప్రమాదంలో కారులోనే మృతి చెందిన హైదరాబాద్‌కు చెందిన మాధవకృష్ణ, సరితా సుమంగళి(ఫైల్‌ఫొటో)

ప్రమాదాల నివారణకు చర్యలు

జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అతివేగం, డ్రైవర్లకు విశ్రాంతి లేకుండా దూరప్రయాణం, నిద్రమత్తు, నిర్లక్ష్యం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటన్నింటిపై అవగాహన కల్పిస్తున్నాం. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలి.

- నాగరాజు, ఎస్ఐ

- ఫిబ్రవరి 7న టెంకాయతోపు వద్ద కారు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న రావులపాడుకు చెందిన మందం వెంకటరత్నం మృతి.
- ఫిబ్రవరి 15న హైదరాబాద్‌కు చెందిన గన్ను మాధవకృష్ణ, పోకల సరితా సుమంగళి దైవ దర్శనానికి వచ్చి కారులో తిరిగి వెళ్తూ దొడ్లవారి మిట్ట వద్ద రోడ్డు పక్కన ఆగివున్న లారీని ఢీకొని దుర్మరణం.
- ఫిబ్రవరి 22న నాయుడుపేట మండలం మాలయకోటకు చెందిన షేక్ ఖలీల్‌బాషా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా దొడ్లవారిమిట్ట వద్ద వాహనం ఢీకొని మృతి.
- ఫిబ్రవరి 28న చవటకండ్రిగ వద్ద లారీని ట్రాలీ ఢీకొని బోల్తా పడిన ఘటనలో రామయ్య మృతి.
- ఫిబ్రవరి 28న చవటకండ్రిగ వద్ద అక్కగారిపేటకు చెందిన ఇలుపూరు నందగోపాల్ బైక్‌పై వెళుతుండగా వాహనం ఢీకొనడంతో మృతి.
- మార్చి 7న రేణిగుంట సమీపంలో గాజులమండ్యం వద్ద జరిగిన ప్రమాదంలో భీమవరం గ్రామానికి చెందిన కట్ల రమణయ్య, దామతోటి తిరుపాల్ మృత్యువాత పడ్డారు.
- మార్చి 8న తాళ్వాయిపాడు వంతెన వద్ద కారు డివైడర్‌ను ఢీకొన డంతో బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సతీష్‌కుమార్ మృతి.
- మార్చి 14న తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన ప్రదీప్ అప్పునూ బైక్‌పై అతివేగంగా వెళ్తూ పెన్నేపల్లి వద్ద ఆగివున్న కంటైనర్‌ను ఢీకొని దుర్మరణం చెందాడు.

పులికాట్ తీరప్రాంత సమస్యలను పరిష్కరించండి

తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు తీరప్రాంత గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే కలిసి పులికాట్ తీరప్రాంత గ్రామాల సమస్యలను వివరించారు. పులికాట్ సరస్సు తీరప్రాంతం వన్యప్రాణి విభాగం సంరక్షణలో ఉందని, దీనివల్ల వేనాడు, పేర్నాడు, కొరిడి గ్రామాల్లో ఆంక్షలు అమల్లో ఉన్నాయన్నారు. దీంతో మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేనాడు, పేర్నాడు రోడ్డుకు నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులతో పాటు నిధులు కేటాయించాలని ఆమె కోరారు. అలాగే తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

అనారోగ్యంతో ఆర్ఐ మృతి

చిట్టమూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా పనిస్తున్న శ్రావణ్ కుమార్ శుక్రవారం మృతి చెందాడు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. శ్రావణ్ కుమార్ కు భార్య, కుమార్తె ఉన్నారు. తహసీల్దార్ శరీష్ కుమార్, డీటీ విజయలక్ష్మి, రీసర్వే డీటీ నిరంజన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు శ్రావణ్ కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ప్రభుత్వం తరపున రూ.25వేల అందజేశారు.

గ్రామీణ నీటి పథకాల పరిశీలన

తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి పథకాలను జడ్పీ సీఈవో విద్యారామ పరిశీలించారు. శుక్రవారం తడకు వచ్చిన ఆమె మాంబట్టులో నిర్మించిన సీపీడబ్ల్యూ పథకానికి సంబంధించి భవన నిర్మాణం, నీటి సరఫరా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్, సర్పంచు రమణయ్య, టీడీపీ నేత వేనాటి రాజారెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

3న ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 3వ తేదీన ఇన్స్‌పిరాన్ 2025 సాంకేతిక సదస్సు సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డితో పాటు పలు విభాగాధిపతులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ సురేష్‌రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు డాక్టర్ శంకరయ్య, పార్థసారథిలు ఉన్నారు.

బైక్ బోల్తా: ఒకరికి గాయాలు

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం బైక్ బోల్తా కొట్టిన ఘటనలో శ్రీకాంత్ అనే చిరువ్యాపారికి గాయాలయ్యాయి.

భూపయ్య కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

నాయుడుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలోని 18వ వార్డు భూపయ్య కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. శుక్రవారం భూపయ్య కాలనీలో స్థానిక నాయకులతో కలసి పర్యటించారు. అక్కడ మురుగునీటి పారుదల సౌకర్యం లేకపోవడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే మున్సిపాలిటీ అధికారులకు తెలియజేసి అక్కడ బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో శివకవి ముకుంద, మునిరాజ, వీరయ్య, అంకయ్య, శీనయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో కూడిన ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యంతో పాటు ఆదాయం కలుగుతుందని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కలీముల్లా పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ఆర్ఏఆర్ఎస్‌లో దళిత మహిళలకు చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీపై నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. డాక్టర్ కలీముల్లా మాట్లాడుతూ చిరుధాన్యాల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయన్నారు. వీటితో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దీన్ని మహిళలు ఒక ఆదాయ వనరుగా భావించి ఆహార ఉత్పత్తుల తయారీ చేయవచ్చన్నారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీ డాక్టర్ సుమతి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే బీపీ, షుగర్ దరిచేరవన్నారు. శరీరంలో అధిక కొవ్వును అరికట్టవచ్చన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న మహిళలకు కిట్, సర్టిఫికేట్‌తో పాటు కొర్ర రవ్వ, రాగిమాల్ట్, జొన్న, రాగితో తయారు చేసిన ఆహార పదార్థాలను అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టు ఎదుట హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.80వేలు అపరాధం విధించారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించండి

గూడూరు, మార్చి 21: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర పభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసిందన్నారు. దళారుల మాటల నమ్మి తక్కువ ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

నేడు రైతు సదస్సు

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ సబ్‌స్టేషన్, మండల పరిధిలోని దేగవారికండ్రిగ సబ్‌స్టేషన్‌లో శనివారం రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ఏఈ పూర్ణిమ తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏవైన సమస్యలుంటే సదస్సులో అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


చెకు అందజేస్తున్న వేనాటి సతీష్ రెడ్డి, పెరుమాల్, జనార్దనరెడ్డి, మునిరాజా తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం మినమలమూడి గ్రామానికి చెందిన బండి నవదీప్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.6,2,445 మంజూరయ్యాయి. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, వేనాటి జనార్దనరెడ్డి, నాపా మునిరాజా, పాపారెడ్డి రవీంద్రరెడ్డి, బండి కృష్ణయ్య, రవినాయుడు, పామంజి వెంకటరమణ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై శిక్షణ తరగతులు

తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై శిక్షణ తరగతులు జరిగాయి. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైదరాబాదు నిజామస్ ఆస్పత్రి ఫిజియోథెరపిస్టులు పాల్గొని శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, ఫిజియో థెరపిస్టులు రమేష్, సంతోష్‌కుమార్, సచివాలయ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, శ్రీనివాసులు, పద్మ పాల్గొన్నారు.

29న మండల సమావేశం

వెంకటగిరి టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు.

కోర్టు ప్రాంగణంలో నాగుపాము

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం నాగుపాము కలకలం సృష్టించింది. కోర్టులో సిబ్బంది విధుల్లో నిమగ్నమై ఉండగా నాగుపాము బుసలు కొడుతూ లోపలికి రావడంతో ఒక్కసారిగా హడలిపోయారు. పట్టణానికి చెందిన పాములు పట్టే వ్యక్తిని తీసుకు రావడంతో అతను చాకచక్యంగా పామును పటుకుని చిట్టేడు ప్రాంతంలో వదిలేశాడు.


పట్టుబడిన నాగుపాము

చెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడికి గాయాలు

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడిలో తాటిచెట్టు నుంచి పడి కల్లుగీత కార్మికుడు కొమారి రమణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. తిన్నెలపూడికి చెందిన రమణయ్య గౌడ్ శుక్రవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తీసుకెళ్లారు.

శ్రీకాళహస్తిలో లోకక్షేమానికి పూజలు


విజయేంద్రసరస్వతికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, పక్కనే బద్రీనాథ్ ప్రధాన అర్చకులు అమరనాథ్ నంబూద్రి రావల్

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడిగా పరమశివుడు కొలువైన శ్రీకాళహస్తి క్షేత్రంలో కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి లోకక్షేమం కాంక్షతో విశేష పూజలు నిర్వహించారు. పలు శైవక్షేత్రాల్లో స్వామి లోకక్షేమమే సంకల్పంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వాయులింగక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు పూజలు నిర్వహించేలా నిర్దేశించారు. ఈ మేరకు పీఠాధిపతులు గురువారం రాత్రి శ్రీకాళహస్తికి విచ్చేశారు. ముక్కంటి ఆలయ అర్చకులు, ఈవో బాపిరెడ్డి విజయేంద్ర సరస్వతికి ధార్మిక లాంచనాలతో స్వాగతం పలికారు. గంగాసదన్ అతిథిగృహంలో తొలి రోజున శుక్రవారం విజయేంద్రసరస్వతి పర్యవేక్షణలో మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర పూజ, దుర్గా సూక్త హోమం నిర్వహించారు. ఇందులో భాగంగా బద్రీనాథ్ క్షేత్రం ప్రధాన అర్చకుడు అమరనాథ్ నంబూద్రీ రావల్ పూజల్లో పాల్గొన్నారు.

ఇద్దరు ఎర్రచందనం దొంగల అరెస్టు

- పది దుంగల స్వాధీనం


ఎర్రచందనం దొంగల అరెస్టు చూపుతున్న అటవీశాఖ అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనాన్ని తరలించేందుకు మామిడితోటలో దాచిపెడుతున్న ఇద్దరు దొంగలను అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి అటవీశాఖ అధికారి లోకేష్ కథనం మేరకు తమిళనాడుకు చెందిన కొందరు శ్రీకాళహస్తి మండలంలోని మేలచ్చూరు వద్ద మామిడితోటలో ఎర్రచందనం దుంగలను దాచి పెడుతున్నట్లు సిబ్బందికి సమాచారం అందింది. ఈ మేరకు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దాడి చేశారు. ముగ్గురు స్మగ్లర్లు పరారీ కాగా శ్రీనివాసులు, సుబ్బరాయుడు పట్టుబడ్డారు. పది దుంగల సహా ఇద్దరిని అదుపులోకి తీసుకుని శ్రీకాళహస్తిలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఆర్ అండ్ డీ కేంద్రం బలోపేతం

- కోబెల్కో కన్‌స్ట్రక్షన్ నిర్ణయం


మీడియా సమావేశంలో టేకేమిచి హిరాకావా తదితరులు

అడయార్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జపాన్‌కు చెందిన కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ కంపెనీ భారత్‌లో నెలకొల్పిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) మరింతగా బలోపేతం చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఈ కంపెనీకి ఆర్ అండ్ డీ కేంద్రం ఏపీలోని తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఉంది. దీనిని మరింతగా బలోపేతం చేయాలని నిర్ణయించింది. అదే సమయంలో ఈ కంపెనీ 20 వేల ఎక్స్‌కవేటర్ల తయారీ మైలురాయిని అధికగమించింది. శ్రీసిటీ ప్లాంట్‌లో ఈ రికార్డును చేరుకుంది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ సేవలకనుగుణంగా ఈ ప్లాంట్ నెలకొల్పినట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో టేకేమిచి హిరాకావా వెల్లడించారు. ఎక్స్‌కవేటర్ల ఉత్పత్తి మైలురాయి చేరుకోవడం, అధిక నాణ్యతా పరికరాలను అందించడంలో తమ నిబద్ధత ప్రతిబింబిస్తుందన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం

నాగలాపురం, మార్చి 21, (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అయ్యప్పను పాలెకార్ సంఘం సన్మానించింది. పిచ్చాటూరు మండలం గొల్లకండ్రిగ, నాగలాపురం మండలం అడవికండ్రిగ, కొట్టకాడు గ్రామానికి చెందిన పాలెకార్లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. నాగయ్య, శ్రీనివాసులు, మునిరత్నం, ఆనందన్, దొరబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడికి సన్మానం

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన పఠాన్ ఫరీద్‌ను శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ మాజీ వైస్‌ఛైర్మన్ మిద్దెల హరి తన కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ... ఫరీద్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామి వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకుడు జులేషా తదితరులు పాల్గొన్నారు.

జేఎఫ్ ఒబెర్లాన్ యూనివర్శిటీ సహకారంతో
విదేశీ ఉపాధి అవకాశాలు
సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోకరాజు



సమావేశంలో అశోకరాజుతో చర్చిస్తున్న ఒబెర్లాన్ వర్శిటీ ప్రతినిధులు

నారాయణవనం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జేఎఫ్ ఒబెర్లాన్ యూనివర్శిటీ సహకారంతో భవిష్యత్తులో సిద్ధార్థ కళాశాల విద్యార్థులకు విదేశీ ఉపాధి అవకాశాలు మెరుగుపడు తా యని ఆ కళాశాల చైర్మన్ అశోక రాజు పేర్కొ న్నారు. నారాయణవనం మండలంలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జేఎఫ్ ఎబెర్లిన్ యూనివర్శిటీ బృందం పర్యటించింది. కళాశాలలో మౌలిక సదుపాయాలు, ప్రయోగ శాలలు, ఆడిటోరియం, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రాల పరిశీలన అనంతరం జేఎఫ్ ఒబెర్లాన్ యూనివర్శిటీ ప్రతినిధులు టాకేరు తెరసావా, షుముటిక్ నకమురా, నీరూధాల్ జి.డిల్లీతో కళాశాల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన రాజు, వైస్ ప్రిన్సిపాల్ గోపీనాథ్, హెచ్‌ఓడీలతో ఇక్కడి కళాశాల మీటింగ్ అవర్ కొత్తకోర్సులపై చర్చించారు. ఒబెర్లిన్ యూనివర్శిటీ, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఎంఓయూతో అధ్యా పకులు, విద్యార్థుల ఎక్స్ఛేంజీ ద్వారా విదేశీ ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. సిద్ధార్థ కళాశాల బృందం తమ వర్సిటీలో పర్యటించాలని ఒబెర్లిన్ వర్శిటీ బృందం కోరింది. జపాన్ యూనివర్శిటీతో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఎంఓయూపై సంతకాలు చేశారు.

కళాశాలల్లో తనిఖీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ బీసీ నేతలు

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాలను గాలి కొదిలేసి ధనార్జనే ధ్యేయంగా పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్న కళాశాలల్లో అధికారులు తనిఖీలు చేపట్టాలని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కోరారు. శుక్రవారం వారు పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ వృత్తి విద్యా కోర్సులకు అనుమతులు ఇచ్చే వివిధ సంస్థలు సంయుక్త తనిఖీలపై దృష్టి పెట్టకపోవడంతో కళాశాలల యజమాన్యాలు అక్రమాలకు పాల్పడుతున్నాయన్నారు. కళాశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రతను కల్పించడంలో కూడా తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ కనీసం ఈపీఎఫ్ రిజిస్ట్రేషన్ చేయకుండా ఉద్యోగుల జీవితాలకు భరోసా లేకుండా చేస్తున్న విషయంపై మంత్రి దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు నెమళ్లూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, మునిరాజాయాదవ్, మణి, శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన ఎమ్మెల్యే ఆదిమూలం





పిచ్చాటూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం శుక్రవారం తిరుపతి విమానా శ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా తిరుమలలో అన్నదానానికి వచ్చి తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రికి, మంత్రికి విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డిరెడ్డి, నాయకులు పద్దురాజు, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పీ4 సర్వేలో సవరణలకు వార్డు సభలు
- మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 సర్వే ప్రక్రియలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు.ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో వున్న 20 శాతం మందిని గుర్తించి పేదరికం దూరం చేయడమే లక్ష్యంగా ఈ సర్వే సాగుతోందన్నారు. ఈనెల 8నుంచి 28వ తేదీ వరకు ఇంటింటా సర్వే సాగుతుందన్నారు. సర్వేలో పేర్కొన్న 27 ప్రశ్నలకు సమాధానాలు సంబంధిత యాప్‌లో సిబ్బంది నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, పీ4 సర్వేలో మార్పులకు వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు పల్లూరు, రాచపాళెం, సత్యనారాయణ కాలనీ, పిళ్లారిపట్టు, దాసరిగుంట, గోవిందపాళ్యం, నందిమంగళం, ఎన్జీవో కాలనీలో మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణపురం, ఆరేటమ్మ కాలనీ, ఆర్టీసీ కాలనీ, లక్ష్మీనగర్, అంబేడ్కర్ కాలనీలో వార్డు సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ వార్డు సభల్లో సవరణలతో పాటు నూతన నమోదు ప్రక్రియ చేపట్టవచ్చన్నారు.

ప్రమాదకరంగా పున్నమి కూడలి



పుత్తూరు అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పున్నమి కూడలి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే పలువురు ఈ కూడలిలో ప్రాణాలు కోల్పోయారు. అలాగే మరెందరో తీవ్రంగా గాయపడ్డారు. అయినా సంబంధిత అధికారుల తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రేణిగుంట - చెన్నై జాతీయ రహదారి నుంచి పుత్తూరు పట్టణానికి వెళ్లాలంటే ఈ మార్గాన్ని దాటాల్సి ఉంది. ఈ క్రమంలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా పుత్తూరు నుంచి చెన్నై వైపు వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు, కార్లు వ్యతిరేక దిశగా వస్తున్నారు. ఇది కూడా ప్రమాదాలకు కారణంగా మారుతోంది. ఇటీవల వ్యతిరేక దిశలో వస్తూ ఓ ట్రాక్టర్ ఇద్దరు విద్యార్థులను ఢీకొనడంతో వారు మృతి చెందారు. జాతీయ రహదారిలో వ్యతిరేక దిశగా పయనించే వారిపట్ల రవాణా శాఖ అధికారలు, పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పున్నమి కూడలిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వస్తుందని ఇటీవల పాలకులు తెలిపారు. అప్పటి వరకు పున్నమి కూడలిలో ప్రమాదాల నియంత్రణకు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు





ఏఎం పురం వద్ద నిరుపయోగంగా డంపింగ్ యార్డు

వడమాలపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వృథాగా ఉన్నాయి. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సంపద కేంద్రాలను ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నిర్లక్ష్య ధోరణితో నిర్వీర్యం చేసింది. మండలంలోని 14 డంపింగ్ యార్డులు నిరుపయోగంగా ఉంది. దీంతో మారుమూల గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపో యాయి. కొన్ని గ్రామాల్లో దగ్గరగా ఉన్న డంపింగ్ యార్డులో స్వచ్ఛందంగా చెత్తను వేస్తున్నారు. అయితే ఉపయోగంలో లేకపోవడంతో పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మేజర్ పంచాయతీ వడమాలపేటలో మాత్రమే సంపద తయారీ కేంద్రం ఉపయోగంలో ఉంది. ప్రజలు ఆరోగ్యం రక్షణ లక్ష్యంతో పాటు డంపింగ్ యార్డుల ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన ఉన్నత ఆశయంతో నిర్మించిన సంపద తయారీ కేంద్రాలను మళ్లీ అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

కంకర క్వారీలు ఆపాలంటూ ధర్నా

సత్యవేడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమర్తి కండ్రిగలో నడుస్తున్న కంకర క్వారీలను ఆపాలని రేపల్లెవాడకు చెందిన చెంచయ్యస్వామి శుక్రవారం ఉదయం రోడ్డుపై బైఠాయించారు. పోలీసుల రంగప్రవేశంతో ధర్నా విరమించిన చెంచయ్య తిరిగి సాయంత్రం నిరసన తెలిపారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుండడంతో ఆపాలని కోరారు.

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు!
నెల్లూరు నుంచి శ్రీకాళహస్తికి చేరుకునేందుకు తిప్పలు



పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కొత్త జాతీయ రహదారితో శ్రీకాళహస్తికి చేరుకోవడానికి ప్రయాణికులు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు. నెల్లూరు నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా శ్రీకాళహస్తి పట్టణానికి చేరుకునేందుకు ప్రయాణికులకు తీవ్ర తిప్పలు తప్పడం లేదు. జాతీయ రహదారి వద్ద పట్టణ శివార్లలో ఎక్కడా బస్టాప్ లేకపోవడంతో బస్సులు దూరంగా వెళ్లి ఆగాల్సి వస్తోంది. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు. నెల్లూరు నుంచి శ్రీకాళహస్తి పట్టణానికి పెద్దసంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి సైతం బస్సులు నెల్లూరు మీదుగా శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళుతుంటాయి. ఆర్డనరీ బస్సులు నెల్లూరు నుంచి వచ్చే సమయంలో తొట్టంబేడు మండలం పెద్దకన్నలి వద్ద జాతీయ రహదారి వద్ద డైవర్షన్ నుంచి సర్వీసురోడ్డు మీదుగా శ్రీకాళహస్తి పట్టణంలోకి వస్తున్నాయి. పెద్దకన్నలి డైవర్షన్ వద్ద ఎలాంటి సూచికబోర్డు, బస్టాప్ కానీ ఏర్పాటు కాలేదు. దీంతో ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ, నాన్‌స్టాప్, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఆగకుండా ముందుకు సాగిపోతున్నాయి. అక్కడ డైవర్షన్ తప్పితే శ్రీకాళహస్తి పట్టణానికి అనుకుని ఉన్న వీఎంపల్లె, ముచ్చివోలు క్రాస్ వద్ద కూడా బస్సులు ఆగేందుకు ఎలాంటి వెసలుబాటు లేదు. దీంతో ఇంకా ముందుకు బస్సులు వెళ్లిపోతున్నాయి. పట్టణం నుంచి సుమారు 8 కిలోమీటర్లు దాటి తిరుపతి మార్గంలో శ్రీకాళహస్తి మండలం ఇసుకగుంట వద్ద బస్సులు ప్రయాణికుల కోసం ఆగుతున్నాయి. శ్రీకాళహస్తికి చేరు కోవాల్సిన ప్రయాణికులు ఇసుక గుంట నుంచి పట్టణానికి రావడానికి రూ.100 అదనంగా వెచ్చించి రామసేతు వంతెన వరకు చేరుకుంటున్నారు. అక్కడి బస్టాండుకు రావాల్సిన ప్రజలు మరో ఆటోను ఆశ్రయించక తప్పడం లేదు. ఇక రాత్రి వేళల్లో భక్తులు కొందరు దిక్కుతెలియని చోట జాతీయ రహదారిపై బస్సు దిగి వాహనాల కోసం అల్లాడిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నెల్లూరు నుంచి వచ్చే బస్సులను పట్టణంలోకి ప్రవేశించేలా అనుమతించాలి. ఇక అనుమతి కుదరని బస్సులకు బసవయ్యపాళెం సర్వీసురోడ్డులో బస్టాప్ కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలికల పాఠశాల ఏర్పాటయ్యేనా?





పాఠశాలలో తరగతి గదులు

పిచ్చాటూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పిచ్చాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలను ప్రత్యేక బాలికల పాఠశాలగా ఏర్పాటు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 6వ తరగతి నుంచి 12 తరగతి వరకు 250 మంది విద్యార్థినులు స్థానికంగా విద్యాభ్యాసం చేస్తున్నారు. దశాబ్ద కాలంగా బాలికల ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నప్పటికీ కార్యరూపం దాల్చ లేదు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ఆదిమూలం పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో ప్రత్యేక బాలికల పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రస్తావించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు

ఇక ఈ పాఠశాల తిరుపతి - చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. దీంతో పిచ్చాటూరు, కీళపూడి, నీరువాయి, కొప్పేడు, అప్పంబట్టు, టీకే పురం, కొత్త గొల్లకండ్రిగ గ్రామాల నుంచి బాలికలు అధిక సంఖ్యలో వచ్చి చదువుకుంటున్నారు. అయితే పాఠశాలలో విద్యార్థినులకు మరుగుదొడ్లు లేవు. రుతుస్రావం సమయంలో బాలికల కోసం అందుబాటులో ఉన్న గదిని అదనపు తరగతి గదుల సముదాయం నిర్మాణం కోసం కూల్చి వేశారు. లైబ్రరీ, కంప్యూటర్ల ల్యాబ్‌లు లేక విజ్ఞాన సముపార్జనలో వెనుకబడుతున్నారు. పాఠశాలకు అధిక శాతం గ్రామీణ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చెందిన చిన్నారులు హాజరవుతు న్నారు. సౌకర్యాలతో కూడిన పాఠశాలలో నాణ్యమైన విద్యనందిస్తే విద్యార్థినులు ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. గతంలో ఈ పాఠశాల నుంచి యేటా ట్రిపుల్ ఐటీకి ముగ్గురినుంచి ఆరుగురు వరకు ఎంపికయ్యేవారు. ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకో వాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆధార్ నమోదుకు స్పందన

కేవీబీపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం సచివాలయంలో చేపట్టిన ఆధార్ నమోదు, తప్పొప్పులు దిద్దుబాటు కార్యక్రమానికి స్పందన వచ్చింది. సంవత్సర కాలంగా మండలంలో ఆధార్‌కు సంబంధించి నమోదు లేకపోవడంతో పక్క మండలాలకు వెళ్లి నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం మండలంలోనే ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడంతో శుక్రవారం 5 సంవత్సరాల లోపు పిల్లలకు నమోదు ప్రక్రియ కొనసాగింది. ఇకపై మిద్దికండ్రిగలో శాశ్వతంగా ఆధార్ నమోదు కేంద్రం ఉంటుందని తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు.


గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

సత్యవేడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. వీరికి ఏప్రిల్ 27వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. అదే విధంగా 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని వివరించారు. సంబంధిత వెబ్‌సైట్‌లో మార్చి 25వ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం స్థానిక ఎంజేపీబీ గురుకుల పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

మురుగు కాలువల నిర్మాణానికి భూమిపూజ

పిచ్చాటూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం మురుగు కాలువ నిర్మాణానికి సర్పంచ్ రోస్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4 లక్షల నిధులతో 200 మీటర్ల మేరకు ఈ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. అలాగే టూటౌన్‌లోని మిగిలిన అన్ని వీధులకు మురికి కాలువల నిర్మాణం త్వరలో ప్రారంభించనున్నట్టు ఆయన వెల్లడించారు. పంచాయతీ అభివృద్ధికికట్టుబడి ఉన్నామని, అన్ని విధాలుగా అభివృద్ధికి కృషి చేస్తానని రోస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శుక్రవారం ఉత్సవం



శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షణ చేసి తిరిగి కొలువు తీర్చారు.

సీఎం దృష్టికి మండల సమస్యలు



సీఎంకు సమస్యలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలను శుక్రవారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మునస్వామి యాదవ్ తిరుపతి విమానాశ్రయంలో సీఎం చంద్రబాబును కలిసి విన్నవించారు. మండలం వెనుకబడటానికి కారణాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి వీటిని పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సురేష్, ప్రకాష్‌యాదవ్, మండల నాయకులు పాల్గొన్నారు.


ఆక్రమణలతో ట్రాఫిక్ ఇబ్బందులు



బీపీ అగ్రహారంలో ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న సీఐ

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలతో రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు. దీంతో పట్టణంలోని బీపీ అగ్రహారం కూడలి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా వ్యాపారులకు శుక్రవారం శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి అవగాహన కల్పించారు. రోడ్డులోకి చొరబడిన ఆక్రమణలను తొలగించుకోవాల్సిందిగా కోరారు. ఇక వాహనాల పార్కింగ్‌ను సైతం నిబంధనల ప్రకారం పాటించాలని హెచ్చరించారు. రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానాలు విధిస్తామని తెలిపారు.

పదో రోజుకు చేరుకున్న దళితుల దీక్ష



రిలే దీక్షలో దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు ఇంటి స్థలాల కోసం చేపడుతున్న దీక్ష శుక్రవారంతో పదో రోజుకు చేరుకుంది. ఎండలో మహిళలు దీక్ష చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి పట్టాలు ఇచ్చే వరకు దీక్షలు కొనసాగిస్తామని చెప్పారు.

ముక్కంటి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్సు ఎఫ్‌ఏసీ



ఆలయం వద్ద శ్రీనివాస శివరాం తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్సు ఎఫ్‌ఏసీ వి.శ్రీనివాస శివరాం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

చట్టవ్యతిరేక పనులపై ఉక్కుపాదం



హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేకకార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఇసుక దిబ్బ వద్ద బహిరంగ మద్య పానం సేవిస్తున్నట్లు గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి, పోలీసులు, తదితరులుపాల్గొన్నారు.

గాజులమండ్యం
సీఐ, ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

రేణిగుంట, మార్చి 21, (ఆంధ్రజ్యోతి): గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్ యథాస్థానంలో శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల ఓ పరిశ్రమకు చెందిన లారీని ఆపడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న సీఐ, ఎస్‌ఐలను డీఐజీ షిమోషీ బాజ్‌పాయి తక్షణం విధుల నుంచి రిలీవ్ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సీఐ, ఎస్‌ఐ వివరణ ఇవ్వడంతో యథాస్థానంలో బాధ్యతలు స్వీకరించారు.